News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in : www.cknewstv.in

# CK NEWS
చంద్రకాంత్
తెలుగు దినపత్రిక

Website cknewstv.in

సంపుటి : 02 | సంచిక :121 | ఖమ్మం | మంగళవారం, జూన్ 18, 2024 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad



# హైదరాబాద్‌లో భారీ వర్షం!

ప్రధాన రహదారులను ముంచేసిన వరద

టోలిచౌకిలో కూలిన 200 ఏళ్ల నాటి వృక్షం

ఓ వ్యక్తికి గాయాలు.. 4 బైక్‌లు ధ్వంసం

రాష్ట్రంలో నేడు, రేపు వర్షాలు

అధికారులు అప్రమత్తంగా ఉండాలి: పొన్నం

రహదారులను ముంచేసిన వరద

రంగారెడ్డి జిల్లా పొద్దుటూరులో 7.3 సెం.మీ..

లంగర్‌హౌసలో 5.8 సెం.మీ వర్షపాతం నమోదు

అప్రమత్తంగా అధికారులు: పొన్నం

వివరాలు 2లో..

సీకే న్యూస్ హైదరాబాద్ : గ్రేటర్ హైదరాబాద్‌లో సోమవారం మధ్యాహ్నం తర్వాత ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. కొన్నిచోట్ల వడగళ్లు పడ్డాయి. ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. ఈదురుగాలులకు పలుచోట్ల కూకటివేళ్లతో చెట్లు కూలిపోయాయి. టోలిచౌకి-గోల్కొండ ఎండీ లైన్స్‌లో 200 ఏళ్లనాటి భారీ వృక్షం కూలిపోయింది. ఈ ఘటనలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. నాలుగు ద్విచక్రవాహనాలు ధ్వంసమయ్యాయి. ఈదురుగాలులకు మధురానగర్ డీ-70 బ్లాక్‌లో భారీవృక్షం నేలకూలింది. ఈ ఘటనలో ఓ కారు ముందుభాగం పాక్షికంగా దెబ్బతింది. ఎర్రగడ్డ ప్రధాన రహదారిపై భారీగా వరదనీరు రోడ్డుపై నిలిచిపోవడంతో ట్రాఫిక్ జామ్ సమస్యలు తలెత్తాయి. ముషీరాబాద్, యూసుఫగూడ శ్రీ కృష్ణానగర్, బాలానగర్, సనత్‌నగర్, అమీర్‌పేట, జూబ్లీహిల్స్,

# త్వరలో జాబ్ క్యాలెండర్..

## ఆర్థిక అస్తవ్యస్తాన్ని సెట్ చేస్తున్నం

12 ఏండ్ల తర్వాత గ్రూప్ - 1 మేమే పెట్టాం


ఇచ్చిన ప్రతి మాటకూ కట్టుబడి ఉన్నం

హరీశ్.. బాబును ఉదాహరణగా తీసుకుంటున్రు

మేం తెలంగాణ ప్రజల ఆలోచనలు అమలు చేస్తం

సీకే న్యూస్ హైదరాబాద్ త్వరలోనే జాబ్ క్యాలెండర్ విడుల చేస్తామని ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చెప్పారు. ఇవాళ ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మాజీ మంత్రి హరీశ్ రావు వ్యాఖ్యలను తప్పుపట్టారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అస్తవ్యస్తంగా వదిలివెళ్లిన ఆర్థిక వ్యవస్థను సెట్ చేస్తున్నామని చెప్పారు. హరీశ్ రావు చంద్రబాబును ఉదాహరణగా తీసుకొని మాట్లాడారంటే ఆయన పరిస్థితి ఇట్టే అర్థం చేసుకోవచ్చని అన్నారు. తెలంగాణలో ఇక్కడి ప్రజల ఆలోచనలను ప్రభుత్వం అమలు చేస్తుందని,

ఏపీ ఆలోచనలు కాదని అన్నారు. 12 ఏండ్ల తర్వాత తామే గ్రూప్%-%1 పరీక్షను నిర్వహించామని చెప్పారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలల వ్యవధిలోనే ఎలక్షన్ కోడ్ అమల్లోకి వచ్చిందని అన్నారు. తాము ఇచ్చిన హామీలను అమలు చేసి




తీరుతామని చెప్పారు. ఆశ వర్కర్ల గురించి మాట్లాడే హక్కు హరీశ్ రావుకు లేదని, వాళ్ల హయాంలో ఆశ వర్కర్లను గుర్రాలతో తొక్కించారని గుర్తు చేశారు. పెద్దపల్లి ఘటనపై విచారణ జరుగుతోందని అన్నారు. శాంతి భద్రతల విషయంలో ప్రభుత్వం సీరియస్ గా ఉందని చెప్పారు. మతఘర్షణ విషయాన్నీ సీరియస్ గా తీసుకుంటున్నామని చెప్పారు. వాటి వెనుక ఎవరున్నా ఉక్కుపాదంతో అణిచి వేస్తామని చెప్పారు.

## బక్రీద్ వేడుకల్లో సీఎం..

- నవాబ్ మహబూబ్ ఆలం ఖాన్ నివాసానికి రేవంత్..
- హాజరైన స్పీకర్ గడ్డం ప్రసాద్, మాజీ మంత్రులు జానా, షబ్బీర్



సీకే న్యూస్ హైదరాబాద్ : బక్రీద్ పర్వదినం సందర్భంగా హైదరాబాద్ బర్కత్‌పురలో జరిగిన వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. సోమవారం రాత్రి గోల్కొండ సిగరెట్ ఫ్యాక్టరీ ఎండీ నవాబ్ మహబూబ్ ఆలం ఖాన్ నివాసంలో బక్రీద్ వేడుకలకు ఆయన హాజరయ్యారు.

వివరాలు 2లో..

## గంజాయిపై ఉక్కుపాదం

- నియంత్రణకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్
- 3 నెలల్లో పూర్తిస్థాయిలో అడ్డుకట్ట: హోంమంత్రి



సీకే న్యూస్ హైదరాబాద్ :రాష్ట్రంలో గంజాయి నియంత్రణకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు హోం మంత్రి వంగలపూడి అనిత ప్రకటించారు. గంజాయి నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై సర్క్యూట్ హౌస్‌లో

వివరాలు 2లో..

## రుషికొండ ప్యాలెస్ వెనుక మరెన్నో విషయాలు

ఇలాంటి కట్టడాలు ఇంకా ఉన్నాయి

వంద రోజుల్లో గంజాయి

అరికట్టేలా ఆదేశాలు: మంత్రి లోకేశ్

వివరాలు 2లో..




## ఉద్యోగుల విభజనపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు

ప్రచారాన్ని నమ్మొద్దు: రాష్ట్ర ప్రభుత్వ వర్గాల వివరణ

తెలంగాణ నుంచి ఏపీకి 1,369 మంది ఆప్షన్లు

ఏపీ నుంచి తెలంగాణకు 1,808 మంది



వివరాలు 2లో..

సీకే న్యూస్ హైదరాబాద్ : తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య ఉద్యోగుల పంపిణీకి సంబంధించి ఇంకా కొత్త నిర్ణయాలేమీ తీసుకోలేదని ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి. ఏపీ నుంచి తెలంగాణకు ఉద్యోగులు వస్తున్నారంటూ

## ఆర్ఆర్ఆర్ నిర్మాణానికి రూ.31 వేల కోట్లు!


ఉత్తర, దక్షిణ భాగాలకు కలిపి అధికారుల అంచనా వ్యయం

350 కిలోమీటర్ల రోడ్డుకు 4,500 హెక్టార్ల భూమి అవసరం

ఉత్తర భాగం నిర్మాణానికి ఆగస్టులో రాష్ట్ర సర్కార్ టెండర్లు

పరిహారంలో 50% చెల్లింపు కోసం హడ్కో నుంచి రుణం!

సీకే న్యూస్ హైదరాబాద్ : రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) నిర్మాణ పనులకు అడుగులు వేగంగా పడుతున్నాయి. ఉత్తర, దక్షిణ భాగాలుగా నిర్మించే ఈ రహదారి నిర్మాణానికి అయ్యే మొత్తం వ్యయంపై అధికారులు ఒక అంచనాకు వచ్చారు. రెండు భాగాలు కలిపి మొత్తం 350 కిలోమీటర్ల మేర నిర్మాణం కానున్న ఆర్ఆర్ఆర్‌కు



వివరాలు 2లో..

## ఏపీలో ఇచ్చారు.. మీరెందుకివ్వరు?



సీకే న్యూస్ హైదరాబాద్ : అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఏపీ సీఎం చంద్రబాబునాయుడు మొదటి సంతకంతోనే పింఛను మొత్తాన్ని రూ.4వేలకు పెంచారని.. తెలంగాణలో ఆరు నెలలైనా కాంగ్రెస్ ప్రభుత్వం దాని ఊసే ఎత్తడం లేదని మాజీమంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. వయోవృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు పింఛను ఎప్పుడు పెంచుతారా అని ఎదురు చూస్తున్నారని చెప్పారు. ప్రజాపాలన పేరిట ప్రజల నుంచి కొత్తగా దరఖాస్తులు తీసుకుని.. వాటిని ఇంతవరకు పరిష్కరించలేదని, పేదల పట్ల ఇంత వివక్ష ఎందుకని నిలదీశారు. కాంగ్రెస్ హామీ ప్రకారం దివ్యాంగులకు రూ.6వేలు, ఇతరులకు రూ.4వేల పింఛను తక్షణం అందజేయాలని డిమాండ్ చేశారు. పింఛను మొత్తం పెరగకపోగా, రాష్ట్రంలో పలు జిల్లాల్లో ఏప్రిల్, మే నెలలకు సంబంధించిన పింఛను రాలేదని వృద్ధులు ఆవేదన చెందుతున్నారన్నారు. సోమవారం తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. అధికారం చేపట్టగానే జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని, ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలిస్తామని చెప్పిన కాంగ్రెస్ ఆరు నెలలయినా జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయకుండా నిరుద్యోగ, యువతీ యువకులను మోసం చేసిందన్నారు. మెగా డీఎస్సీ ద్వారా 25 వేల ఉద్యోగాలు కల్పిస్తామని

వివరాలు 2లో..

# ఆర్ఆర్ఆర్ నిర్మాణానికి రూ.31 వేల కోట్లు!

- మొదటి పేజి తరువాయి

రూ.31 వేల కోట్ల మేర నిధులు ఖర్చవుతాయని లెక్కగట్టారు. తొలుత నిర్మాణం చేపట్టే ఉత్తరభాగం రహదారికి ఆగస్టు రెండో వారంలో టెండర్లకు వెళ్లాలని ఇప్పటికే సూత్రప్రాయంగా నిర్ణయించిన నేపథ్యంలో రహదారి స్వరూపాన్ని కూడా ఖరారు చేశారు. మరోవైపు దక్షిణ భాగంపైనా జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) అధికారులు కసరత్తు చేస్తున్నారు. అలైన్‌మెంట్‌పై చర్చలు జరుపుతున్నారు. ఈ వివరాలతో కేంద్రానికి లేఖ రాయనున్నారు. కాగా, ఆర్ఆర్ఆర్ నిర్మాణానికి 4,500 హెక్టార్ల భూమి అవసరమవుతుందని గతంలోనే తేల్చారు. ఇందులో.. ఉత్తర భాగం నిర్మాణానికి 90శాతం భూసేకరణ పూర్తిచేశారు. పరిహారం, నిర్మాణ ఖర్చు విషయంలో అ?ధికారులు వేగంగా చర్యలు తీసుకుంటున్నారు. మరోవైపు దక్షిణ భాగం రహదారి నిర్మాణ ప్రతిపాదనలు పంపాలని గతంలోనే కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ.. తెలంగాణ జాతీయ రహదారుల సంస్థ అధికారులను ఆదేశించారు. దీంతో డీపీఆర్ పనులపై అధికారులు నిమగ్నమయ్యారు. రాష్ట్రంలోని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఆర్ఆర్ఆర్ నిర్మాణంపై కృతనిశ్చయంతో ఉంది. గతేడాది డిసెంబరులో సర్కారు చొరవతో ఉత్తర భాగం యుటిలిటీ చార్జీల చెల్లింపు అంశానికి తెరపడింది. దక్షిణ భాగం రోడ్డుకు జాతీయ రహదారి నంబర్‌ను కేటాయించేందుకూ కేంద్రం పచ్చజెండా ఊపింది. కాగా, సంగారెడ్డి- చౌటుప్పల్ వరకు 161 కి.మీ మేర నిర్మాణం జరుపుకొనే ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం కోసం రూ.1,940 హెక్టార్ల మేర భూమి అవసరం పడుతోంది.

రోడ్డు నిర్మాణానికి మొత్తం రూ.15 వేల కోట్లకు పైగా నిధులు అవసరమవుతున్నాయి. ఇందులో పరిహారానికే రూ.5,200 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఇక చౌటుప్పల్‌లో మొదలై సంగారెడ్డికి అనుసంధానమయ్యే దక్షిణ భాగం రహదారి 189 కి.మీ.పరిధిలో ఉంటుంది. ఇందుకు 2వేల హెక్టార్ల భూమి అవసరమవుతోంది. ఈ రోడ్డు నిర్మాణానికి రూ.16 వేల కోట్లకు పైగా నిధులు అవసరమవుతుండగా.. ఇందులో రూ.6,500 కోట్ల నుంచి రూ.7వేల కోట్ల వరకు భూ పరిహారం కింద చెల్లించాల్సి ఉంటుందని అ?ధికారులు తేల్చారు. దీని ప్రకారం మొత్తం 350 కి.మీ. మేర నిర్మితమయ్యే రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి రూ.31 వేల కోట్లు అవసరమవుతాయని అంచనా వేశారు.

**పరిహారంలో రాష్ట్ర వాటా రూ.6,300 కోట్లు..**

ఆర్ఆర్ఆర్ నిర్మాణానికిగాను ఎన్‌హెచ్ఏఐ సేకరించిన భూమికి చెల్లించే మొత్తం భూ పరిహారంలో సగం వాటాను రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సి ఉంటుంది. ఈ రోడ్డును మంజూరు చేస్తే భూ పరిహారం చెల్లింపుల్లో 50 శాతాన్ని రాష్ట్ర వాటాగా చెల్లిస్తామని 2018 ఆగస్టు 29న కేంద్రమంత్రికి అప్పటి సీఎం కేసీఆర్ రాసిన లేఖలో పేర్కొన్నారు. దాంతో ఉత్తరభాగం భూ సేకరణలో సగం వాటా కింద రూ.2,700 కోట్లు, దక్షిణభాగం భూ సేకరణలో సగం వాటా కింద రూ.3,600 కోట్లు కలిపి మొత్తం దాదాపు రూ.6,300 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌హెచ్ఏఐకి చెల్లించాలి. దీంతో ఈ మొత్తాన్ని బ్యాంకు నుంచి రుణంగా తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది.

# ఏపీలో ఇచ్చారు.. మీరెందుకివ్వరు?

- మొదటి పేజి తరువాయి

చెప్పి.. 11 వేల పోస్టులే ప్రకటించారని, హామీ ప్రకారం 25 వేల టీచర్ పోస్టులు భర్తీ చేయాలని, ఇతర ఉద్యోగాలకు జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.గ్రూప్ 1 ప్రిలిమ్స్‌లో పాసయిన అభ్యర్థులను ఒక పోస్టుకు 50మంది చొప్పున మెయిన్స్‌కు ఎంపిక చేస్తున్నారని.. దీనిని ఒక పోస్టుకు వందమంది చొప్పున పెంచాలని, తద్వారా ఎంతో మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు మేలు జరుగుతుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 1:100 విధానం అమలు చేస్తామని ప్రస్తుత ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గతంలో అసెంబ్లీ సాక్షిగా చెప్పారని హరీశ్ గుర్తు చేశారు. గ్రూప్స్ పరీక్షలకు మధ్య కనీసం రెండు నెలల వ్యవధి ఉండాలని అభ్యర్థులు కోరుతున్నారని, నిరుద్యోగ యువతీ యువకులకు బీఆర్ఎస్ అండగా నిలుస్తుందన్నారు.

**ఒకటో తేదీన జీతాలిస్తే.. నిరసనలెందుకు?**

ప్రతీ నెల ఒకటో తేదీన ఉద్యోగులకు జీతాలిస్తున్నామని మంత్రులు చెబుతున్నారని, అలా జీతాలిస్తే.. ఆశావర్కర్లు వైద్యవిధాన పరిషత్ వద్ద ధర్నా ఎందుకు చేస్తారని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు సహా... ఎన్‌హెచ్ఎం కింద పని చేసే 17వేల మందికి వెంటనే జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీల పరిధిలో పని చేసే కార్మికులకు 5 నెలలుగా వేతనాలు రావడంలేదన్నారు. రాష్ట్రంలోని 60 వేల మంది అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది జీతాల కోసం రోడ్డెక్కుతున్నారని గుర్తు చేశారు. సీఎంఆర్ఎఫ్ చెక్కులపై కేసీఆర్ బొమ్మ ఉందని, గత ప్రభుత్వ హయాంలో మంజూరైన చెక్కులను సైతం ఇవ్వకుండా పేదప్రజలను ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. లక్షన్నర మంది చెక్కుల కోసం ఎదురు చూస్తున్నారని, వారిని ఆదుకోవాలని కోరారు.

**వారికి లీగల్ నోటీసులు పంపిస్తా**

తాను పార్టీ మారబోతున్నట్లుగా జరుగుతున్న ప్రచారంపై హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో వ్యూస్ పెంచుకోవడం కోసం కొందరు వ్యక్తులు, రేటింగ్‌ల కోసం కొన్ని టీవీ ఛానళ్లు తనపై బురద చల్లేయత్నం చేస్తున్నాయన్నారు. వాళ్ల స్వలాభం కోసం తనను, బీఆర్ఎస్ పార్టీని ప్రజల్లో దిగజార్చే యత్నం చేస్తే ఊరుకోనని.. లీగల్ నోటీసులు ఇచ్చి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# గంజాయిపై ఉక్కుపాదం

- మొదటి పేజి తరువాయి

జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జున, విశాఖ సీపీ రవిశంకర్ అయ్యన్నార్, జాయింట్ సీపీ ఫకీరప్పతోపాటు నగరంలోని పైస్థాయి పోలీస్ అధికారులతో సోమవారం ఆమె సమీక్ష నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అనిత మాట్లాడుతూ... వైసీపీ ప్రభుత్వ హయాంలో విశాఖ గంజాయి, మాదక ద్రవ్యాలకు రాజధానిగా మారిపోయిందన్నారు. యువతకు గంజాయి సులభంగా దొరుకుతోందని, ఆ మత్తులో వారు దోపిడీలు, చైన్‌స్నాచింగ్‌లు, ఈవ్‌టీజింగ్ వంటి నేరాలకు పాల్పడుతున్నారని అన్నారు. ఏపీని గంజాయి రహిత రాష్ట్రంగా మార్చేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించానన్నారు. హోంమంత్రిగా బాధ్యతలు చేపట్టకముందే నగరంలోని పోలీస్ అధికారులతో సమావేశం ఏర్పాటుచేసి దీనికి సంబంధించిన ఆదేశాలు జారీ చేశానన్నారు. చెక్‌పోస్టుల సంఖ్య పెంచడంతోపాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని పోలీసులకు స్పష్టంగా చెప్పానన్నారు. టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటుచేసి నగరంలో రాత్రిపూట గుంపుగా ఉండే యువతను, బస్టాపుల్లో కనిపించే ఆకతాయిలను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించాలని, సోమవారం నుంచే ఈ ప్రక్రియ ప్రారంభం కావాలని ఆదేశాలిచ్చినట్టు తెలిపారు. గంజాయి కేసుల్లో పట్టుబడేవారు ఏ పార్టీవారైనా, చివరకు టీడీపీ వారైనా సరే క్షమించేది లేదని హెచ్చరించారు. గంజాయి డీ అడిక్షన్ సెంటర్లు పెంచడంతోపాటు, కేజీహెచ్‌లో ప్రత్యేకంగా ఒక బ్లాక్‌ను కేటాయించే ప్రతిపాదన ఉందన్నారు. మూడు నెలల్లో గంజాయికి పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేస్తామని చెప్పారు. ఇకపై దిశ పోలీస్ స్టేషన్ల పేరును మహిళా పోలీస్ స్టేషన్‌గా మార్చేస్తామని హోంమంత్రి అన్నారు.

**ఇంకా జగన్‌పై ప్రేమ ఉంటే వెళ్లిపోండి..**

గత ఐదేళ్లు కొంతమంది పోలీసులు వైసీపీ సేవలోనే తరించారని, టీడీపీ నేతలను వేధించడంలోనే మునిగితేలారని మంత్రి అనిత అన్నారు. తాము పోలీసులకు అన్ని సదుపాయాలూ కల్పిస్తామని, పనితీరు కూడా అదేస్థాయిలో ఉండాల్సిందేనని చెప్పారు. ఇప్పటికైనా ప్రజా పోలీసింగ్ చేయాలని, అలాకాకుండా ఎవరికైనా ఇంకా జగన్‌పై ప్రేమ ఉంటే తక్షణం లూప్‌లైన్‌లోకి వెళ్లిపోవాలని హోం మంత్రి స్పష్టం చేశారు. పోలీస్ వ్యవస్థను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేస్తామన్నారు. పోర్టులోకి 2,500 కిలోల హెరాయిన్‌తో కంటైనర్ రాక కేసుపై కూడా దృష్టిపెడతామన్నారు. కాగా, రాష్ట్రంలో గంజాయి రవాణా, వినియోగానికి అడ్డుకట్ట వేసేందుకు వీలుగా వారంరోజుల్లో టోల్‌ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేయనున్నట్టు హోంమంత్రి చెప్పారు.

# తెలంగాణలో 28 ఐపీఎస్‌ల బదిలీ..

- మొదటి పేజి తరువాయి

కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. నల్గొండ ఎస్పీగా శరత్ చంద్ర పవార్, జగిత్యాల ఎస్పీగా అశోక్‌కుమార్ , సూర్యాపేట ఎస్పీగా సన్‌ప్రీత్ సింగ్, హైదరాబాద్ ట్రాఫిక్ డీసీపీగా రాహుల్ హెగ్డే, జోగులాంబ గద్వాల ఎస్పీగా టి. శ్రీనివాసరావు, వరంగల్ వెస్ట్ జోన్ డీసీపీగా రాజమహేంద్రనాయక్, మంచిర్యాల డీసీపీగా భాస్కర్, ఆదిలాబాద్ పీటీసీ ఎస్పీగా నితికాపంత్, ఏసీబీ జాయింట్ డైరెక్టర్‌గా రుత్‌రాజ్, సీఐడీ ఎస్పీగా విశ్వజిత్ కంపాటి, శంషాబాద్ డీసీపీగా రాజేశ్, వికారబాద్ ఎస్పీగా నారాయణ రెడ్డి, డిచ్ పల్లి పోలీస్ కమాండెంట్ గా రోహిణి ప్రియదర్శిని, మహబూబ్ నగర్ ఎస్పీగా జానకి ధరావత్, ఆసిఫాబాద్ ఎస్పీగా డీవీ శ్రీనివాస రావు, బాలానగర్ డీసీపీగా సురేష్, సైబర్ సెక్యూరిటీ ఎస్పీగా హర్షవర్ధన్, మేడ్చల్ డీసీపీగా కోటిరెడ్డి, సికింద్రాబాద్ రైల్వేఎస్పీగాచందనా దీప్తి, , సెంట్రల్ జోన్ డీసీపీగా షేక్ సలీమా, నార్త్ జోన్ డీసీపీగా రష్మీ పెరుమాళ్, ఏసీబీ జాయింట్ డైరెక్టర్ గా సాయి చైతన్య

# రేపటి నుంచి సెప్టెంబరు నెల ఆర్జిత సేవా టికెట్ల కోటా విడుదల చేయనున్న టీటీడీ

**జూన్ 18 నుంచి 20 వరకు ఎలక్ట్రానిక్ డిప్ రిజిస్ట్రేషన్లు**

**ఈ నెల 21న ఆర్జిత సేవా టికెట్ల విడుదల**

**జూన్ 22 మధ్యాహ్నం సీనియర్ సిటిజెన్లు, దివ్యాంగుల కోటా విడుదల**

**రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లను జూన్ 24వ తేదీ విడుదల**

**తిరుమలలో సెప్టెంబరు నెలకు సంబంధించిన ఆర్జిత సేవా టికెట్ల కోటాను టీటీడీ రేపటి నుంచి విడుదల చేయనుంది.**

హైదరాబాద్ పెన్ పవర్: సుప్రభాతం, తోమాల సేవ, అర్చన, అష్టదళ పాద పద్మారాధన సేవల టికెట్లను ఎలక్ట్రానిక్ డిప్ ద్వారా కేటాయించనున్నారు. అందుకు గాను రేపు (జూన్ 18) ఉదయం 10 గంటల నుంచి 20వ తేదీ ఉదయం 10 గంటలకు రిజిస్ట్రేషన్ కు అవకాశం కల్పించారు. ఈ మూడ్రోజుల్లో తమ వివరాలు నమోదు చేసుకున్న భక్తులకు ఎలక్ట్రానిక్ డిప్ ద్వారా పలు ఆర్జిత సేవల టికెట్లు కేటాయిస్తారు. ఎలక్ట్రానిక్ డిప్ లో ఆర్జిత సేవా టికెట్లు పొందిన వారు జూన్ 20వ తేదీ మధ్యాహ్నం 12 గంటల నుంచి 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్దేశిత నగదు చెల్లించి టికెట్లను ఖరారు చేసుకోవాల్సి ఉంటుంది. ఇక, కల్యాణం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, దీపాలంకార సేవ టికెట్లను ఈ నెల 21వ తేదీన ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు. ఇక కల్యాణం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, దీపాలంకార సేవల్లో వర్చువల్ గా పాల్గొనే భక్తుల కోసం జూన్ 21 మధ్యాహ్నం 3 గంటలకు కోటా విడుదల చేయనున్నారు. అంగప్రదక్షిణం టికెట్లను జూన్ 22న ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు. అదే రోజున మధ్యాహ్నం 3 గంటలకు సీనియర్ సిటిజెన్లు (వృద్ధులు), దివ్యాంగులకు ప్రత్యేక ప్రవేశ దర్శనం కోసం టికెట్లు విడుదల చేస్తారు.

రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లను జూన్ 24వ తేదీ ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు. తిరుపతి-తిరుమలలో బస చేయడం కోసం జూన్ 24వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు కోటా విడుదల చేస్తారు. ఈ టికెట్లను ఆన్ లైన్ లో %ఎవఋుఋఖుఋఎం.ఖజూ.స్త్రశీజ.అఅ% ద్వారా బుక్ చేసుకోవాల్సి ఉంటుందని టీటీడీ ఓ ప్రకటనలో తెలిపింది.

# బక్రీద్ వేడుకల్లో సీఎం..

- మొదటి పేజి తరువాయి

ఈ సందర్భంగా ఆలంఖాన్ కుటుంబ సభ్యులకు సీఎం బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. అన్వర్ ఉల్ ఉలూమ్ ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రెటరీ నవాబ్ ముజాహిద్ ఆలం ఖాన్ తదితర కుటుంబ సభ్యులతో కలిసి ఆయన భోజనం చేశారు.

అనంతరం వారితో ఫొటోలు దిగారు. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్, మాజీ మంత్రులు జానారెడ్డి, షబ్బీర్‌అలీ, ఎమ్మెల్యే దైవీర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడు రోహిన్ రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ యాదవ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కూడబలుక్కుని కూల్చేశారు!

- మొదటి పేజి తరువాయి

సీఈ చూశారని నారాయణరెడ్డి చెప్పారు. దీంతో మరింత అసహనం వ్యక్తం చేసిన చంద్రబాబు.. ఈ విధ్వంసంలో మీ బాధ్యత లేదా అని ఆయన్ను ప్రశ్నించారు. పూర్తిస్థాయి సమీక్షకు ఇప్పుడు సమయం లేదని.. త్వరలోనే మళ్లీ ప్రాజెక్టు పరిశీలనకు వచ్చి సమీక్షిస్తానని స్పష్టం చేశారు. జగన్ నాయకుడు కాదు.. విధ్వంసకుడు. దురదృష్టం కొద్దీ రాష్ట్ర రాజకీయాల్లోకి వచ్చారు. రాష్ట్ర ప్రజల దురదృష్టం కొద్దీ ముఖ్యమంత్రి అయ్యారు. నేను ఐదేళ్లు కష్టపడి ఒక దశకు తీసుకొచ్చిన పనులన్నిటినీ నిర్వీర్యం చేశారు. గత ఐదేళ్లలో వాటిల్లిన నష్టానికి కారకులెవరు?

# రుషికొండ ప్యాలెస్ వెనుక మరెన్నో విషయాలు

విశాఖలోని రుషికొండ ప్యాలెస్ వెనుక మరెన్నో విషయాలు దాగున్నాయని, ఇలాంటి కట్టడాలు ఇంకా ఉన్నాయని రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. రుషికొండ ప్యాలెసకు ఎంత ఖర్చు చేశారు.. దేనికి ఖర్చు చేశారు అనే విషయాలకు సంబంధించి సీఎం చంద్రబాబు ఇప్పటికే నివేదిక అడిగారని, పూర్తి వివరాలు వచ్చిన తరువాత ప్రజల ముందు బహిర్గత పరుస్తామని తెలిపారు. బక్రీద్ సందర్భంగా మంగళగిరి ఈద్గాలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో మంత్రి లోకేశ్ పాల్గొన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ యువగళం పాదయాత్ర సందర్భంగా.. గంజాయి వల్ల నష్టపోయిన కుటుంబాల గోడు తనను కలచివేసిందన్నారు. వంద రోజుల్లో గంజాయిని పూర్తిగా నియంత్రించేలా చర్యలు తీసుకోవాలని ఇప్పటికే పోలీసులకు ఆదేశాలిచ్చామన్నారు. తాను కూడా డీజీపీ, హోం మంత్రితో ఈ విషయమై మాట్లాడానని, సెబ్ అధికారులతో సమీక్ష జరిపి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ కార్యకర్తలపై వైసీపీ మూకల దాడులు ఆగలేదన్నారు. ఈ 12 రోజుల్లో ముగ్గురు టీడీపీ కార్యకర్తలను వైసీపీ నేతలు హత్య చేశారని తెలిపారు. మంగళగిరి నియోజకవర్గం దుగ్గిరాలలో టీడీపీకి చెందిన ఓ మైనార్టీ కార్యకర్తను వైసీపీ నాయకుడు బ్యాటుతో కొట్టి చంపాడని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు ఓర్పు, సహనంతో ఉండాలని చెప్పడంతో లా అండ్ ఆర్డర్ సమస్య తలెత్తకుండా ఎంతో సంయమనంతో ఉన్నామని తెలిపారు. మంగళగిరి నియోజకవర్గానికి ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తానన్నారు. ముఖ్యంగా దశాబ్దాల కాలంగా పేదలు నివసిస్తున్న భూములను రెగ్యులరైజ్ చేయడం, డ్రెయిన్లు, రోడ్లు, ఇతర మౌలిక వసతులు, స్వర్ణకారులకు గోల్డ్ క్లస్టర్ వంటి హామీలను నెరవేరుస్తామని మంత్రి లోకేశ్ మరోమారు స్పష్టం చేశారు.

# హైదరాబాద్‌లో భారీ వర్షం!

- మొదటి పేజి తరువాయి

బంజారాహిల్స్, లంగర్‌హౌస్, అసిఫనగర్, మెహిదీపట్నం, షేక్‌పేట, మాదాపూర్, గచ్చిబౌలి, కూకట్‌పల్లి, ఫిల్మ్‌నగర్, అసిఫనగర్, పటాన్‌చెరువు ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షంతో రోడ్లపై మోకాళ్లలోతు వరదనీరు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వరదనీరు తొలగించేందుకు డిజాస్టర్ బృందాలు రంగంలోకి దిగాయి. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం ప్రొద్దుటూరులో 7.3 సెం.మీ, లంగర్‌హౌసలో 5.8 సెం.మీ వర్షపాతం నమోదైంది. కాగా జీహెచ్ఎంసీ పరిధిలో మరో రెండురోజుల పాటు ఉరుములు, మెరుపులతో తేలికపాటి నుంచి ఓ మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని బేగంపేట వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

మంగళవారం సాయంత్రం, రాత్రి సమయంలో ఈదురుగాలులు 30-40 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశాలుంటాయని చెప్పారు. కాగా హైదరాబాద్‌లో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో యంత్రాంగమంతా అప్రమత్తంగా ఉండాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. మ్యాన్‌హోల్ వద్ద ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలని, విద్యుత్తు స్థంభాలు, చెట్లవద్ద ప్రజలు జాగ్రత్తగా ఉండాలని కోరారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావొద్దని కోరారు.

**నేడు, రేపు వర్షాలే**

రాష్ట్రంలో మంగళ, బుధవారాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. సోమవారం రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఓ మోస్తరు వర్షం కురిసినట్లు తెలిపింది. కరీంనగర్ జిల్లాల్లో 19.1 మిల్లీమీటర్లు, నిర్మల్‌లో 18, జయశంకర్ జిల్లాల్లో 17, ఆసిఫాబాద్ జిల్లాల్లో 14 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తెలిపింది. ఈ ఏడాది జూన్ 1 నుంచి 14 వరకు రాష్ట్ర వ్యాప్తంగా సాధారణం కంటే ఎక్కువగానే వర్షపాతం నమోదైందని, నిరుడు ఇదే సమయంలో కేవలం 13.5 మిలీమీటర్ల వర్షపాతం రికార్డవ్వగా, ఈ ఏడాది ఇప్పటివరకు 50.4 మిల్లీమీటర్లు నమోదైనట్లు వెల్లడించింది.

# ఉద్యోగుల విభజనపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు

- మొదటి పేజి తరువాయి

జరుగుతున్న ప్రచారాన్ని నమ్మొద్దని కోరాయి. రాష్ట్రం ఏర్పడిన ఏడాది రెండేళ్లలోనే ఉద్యోగుల పంపిణీ ప్రక్రియ దాదాపుగా ఓ కొలిక్కి వచ్చిందని వివరించాయి. ఉద్యోగుల విభజన సమయంలో ఆప్షన్లు, పోస్టుల లభ్యత ఆధారంగా తెలంగాణ స్థానికత ఉన్న ఉద్యోగులు కొందరు ఏపీకి, ఏపీ స్థానికత ఉన్నవారిలో కొందరిని తెలంగాణకు పంపిణీ చేశారని పేర్కొన్నాయి. వైద్య అవసరాలు, భార్యాభర్తలు ఉద్యోగాల్లో ఉండడం, పిల్లల చదువులు, సొంత ఇళ్లు ఉన్నాయనే కారణాలతో కొందరు ఉద్యోగులు ఈ పంపిణీతో ఇబ్బంది పడ్డారని తెలిపాయి.

మానవీయ కోణంలో తమ బాధను అర్థం చేసుకోవాలంటూ పలుమార్లు ప్రభుత్వాన్ని అభ్యర్థించారని వివరించాయి. ఏపీకి వెళ్లేందుకు తమకు అవకాశం కల్పించాలని కోరుతూ తెలంగాణకు కేటాయించిన 1,369 మంది ఉద్యోగులు కోరారని పేర్కొన్నాయి. 2021 సెప్టెంబరులోవారందరినీ ఏపీకి పంపించేందుకు తమకెలాంటి అభ్యంతరం లేదని తెలియజేస్తూ సర్క్యులర్ జారీ చేశామని స్పష్టం చేశాయి. ఏపీ ప్రభుత్వం కూడా తెలంగాణకు వచ్చేందుకు సిద్ధపడిన ఉద్యోగుల వివరాలను సేకరించిందని, అక్కడి నుంచి 1,808 మంది ఉద్యోగులు తెలంగాణకు రావడానికి ఆప్షన్లు ఇచ్చారని.. 2022 సెప్టెంబరు 23న అప్పటి ఏపీ సీఎస్ సమీర్‌శర్మ.. అప్పటి తెలంగాణ సీఎస్ సోమేశ్‌కుమార్‌కు లేఖ రాశారని పేర్కొన్నాయి. రెండు రాష్ట్రాల్లో ఆప్షన్లు ఇచ్చిన ఉద్యోగుల పరస్పర బదిలీకి రెండు ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకోవాలంటూ ఉద్యోగులు కోరారని గుర్తుచేశాయి. ఈ అంశం ఎనిమిదేళ్లుగా నానుతున్న వ్యవహారమని.. విభజన చట్టంలోని అంశాలపై రెండు రాష్ట్రాల మధ్య సమావేశాలు జరిగినప్పుడల్లా చర్చకు వచ్చిందని వివరించాయి.

తెలంగాణ ఆవిర్భవించి పదేళ్లు పూర్తి కావటంతో విభజన చట్టంలోని అంశాలు.. రెండు రాష్ట్రాల మధ్య అపరిష్కృతంగా ఉన్న అంశాలన్నిటినీ ఆరా తీశామని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఇంతకాలం ఉమ్మడి రాజధానిగా ఉన్న హైదరాబాద్ ఈ నెల 2 నుంచి తెలంగాణకు ప్రత్యేక రాజధానిగా మారిందని, ఇదే సందర్భంగా ఏపీకి కేటాయించిన ఆఫీసులు, భవనాలతో పాటు విభాగాల వారీగా విభజన చట్టంలోని అన్ని అంశాలపై ప్రత్యేక నివేదిక ఇవ్వాలని ఆర్థికశాఖకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారని వెల్లడించాయి. పెండింగ్‌లో ఉన్న అంశాలపై తదుపరి చర్చలు, సమావేశాలేవీ జరగలేదని స్పష్టం చేశాయి.

# భక్తిశ్రద్ధలతో బక్రీద్ వేడుక.

- ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు.





**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూన్ 17,** బక్రీద్ పండుగను పురస్కరించుకొని భద్రాచలం పట్టణంలోని ఏఎంసీ కాలనీలో ఉన్న ఈద్గాలో వేలాది మంది ముస్లిం సోదరులు సోమవారం బక్రీద్ నమాజ్ ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మత పెద్దలు మాట్లాడుతూ... త్యాగం, స్నేహం, పవిత్రత, దయ గుణానికి ప్రతీకగా నిలిచిన పవిత్రమైన రోజు బక్రీద్ అన్నారు. ఇబ్రహీం సలాం వృద్ధాప్యంలో లేక లేక ఒక పుత్రుడు జన్మిస్తే ఆ పుత్రుడునీ కుర్బాని చేయాలని అల్లా ఆదేశిస్తే ఆయన వెంటనే అల్లా ఆజ్ఞని పాటిస్తూ కుమారునికి కుర్బానీయటానికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. అలాంటి త్యాగానికి ఒడిగట్టిన ఇబ్రహీం సలాం దానికి ప్రత్యేకగానే ముస్లిం సోదరులందరూ కూడా బక్రీద్ రోజు పొట్టేలు గాని, మేకపోతు గాని కుర్బానీ చేసి మూడు భాగాలు చేసి ఒక భాగము పేదవారికి, ఒక భాగం బంధువులకి, మరొక భాగము కుర్బానీ ఇచ్చినారు ఉంచుకోవడం జరుగుతుందని తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో హిందూ, ముస్లిం భాయ్ బాబుగా ఉండాలని, ఎలాంటి హింసలకి తావు రాకూడదని ఖురాన్ లో గాంధీ మార్గమే రాసి ఉన్నదని పేర్కొన్నారు. ా

ఈ కార్యక్రమంలో ముస్లిం మతపెద్దలు షఫీ, అబ్దుల్లా, మునాఫ్, షేక్ అజీమ్, సర్ఫరాజ్, అలీ భాష, అక్బర్, సిందా, షరీఫ్, అలీమ్ ఖాన్, సలీం రహీం, నవాబ్,రఫీ తదితరులు పాల్గొన్నారు

## ఇబ్రహీంపూర్ లో పేద కుటుంబాలకు సహాయం అందించిన చేగుంట మండల కాంగ్రెస్ యువ నాయకుడు సంద్రుగు శ్రీకాంత్





**చేగుంట జూన్ 17 ( సీకే న్యూస్ ). రిపోటర్ కొండి. శ్రీనివాస్** మెదక్ జిల్లా చేగుంట మండలం ఇబ్రహీంపూర్ గ్రామంలో దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జ్, చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు ఇబ్రహీంపూర్ లో తలారి వెంకట్ మరియు వడ్ల లక్ష్మి మరణించిన కుటుంబాల పరామర్శించి నా మనసున్న మారాజు కాంగ్రెస్ నాయకుడు సంద్రుగ్గు శ్రీకాంత్ సహాయం ఒకరి కుటుంబానికి 50 కిలోలు బియ్యం మరియొక కుటుంబానికి 50 కిలోలు బియ్యం అందించడం జరిగింది ఇట్టి ఈ కార్యక్రమంలో చేగుంట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వడ్ల నవీన్ కుమార్ దుబ్బాక నియోజకవర్గం యువ నాయకుడు సాయి చేగుంట మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు చౌదరి శ్రీనివాస్ మరియు మర్పల్లి గణేష్ ఎర్ర గొల్ల కనకరాజు నీల మహేష్ చెంది మధు సాయి శ్రీమన్ తదితరులు పాల్గొన్నారు

## ప్రతి పేద కుటుంబానికి భూమి, విద్య, ఉద్యోగం కల్పించాలి.

దళిత ప్రజా సంఘం డిమాండ్.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూన్ 17,** స్థానిక ఏ ఎం సీ కాలనీ నందు దళిత ప్రజా సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షుడు అల్లాడి జయరాజు పాల్గొని మాట్లాడుతూ..... ప్రతి పేద కుటుంబానికి భూమి విద్య ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశానికి స్వతంత్రం వచ్చి 75 ఏళ్లు గడుస్తున్న నిరుపేదల నిరుపేదలగానే ఉన్నారని, ప్రభుత్వ భూమి ఎంత ఉన్న పేదలకు సెంటు భూమి కూడా ఇచ్చేందుకు ప్రభుత్వాలు సిద్ధంగా లేవని, భూమిని ప్రభుత్వం లీజుల పేరు మీద పేదలకు కాకుండా చేస్తుందని ఆవేదన వ్యక్తపరిచారు. పేద విద్యార్థులకు విద్యలో సరైనటువంటి సదుపాయాలు కల్పించకపోవడం, విద్యను కార్పొరేట్ ,ప్రైవేట్ వ్యవస్థలకు అప్పజెప్పి పేదవాడు చదువుకునే దానికి చదువు కొనుక్కునే పరిస్థితి కల్పిస్తుందని, ప్రభుత్వం విద్యను కొనుక్కునే వస్తువుగా మార్చి పేదలను విద్యకు దూరం చేసే ప్రయత్నం జరుగుతుందని ఆవేదన ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అధిక జనాభా కలిగిన పేదలకు విద్య ఉద్యోగ భూమి సదుపాయం కలుగుతుందని కొండంత ఆశతో ఎదురుచూస్తున్నామని అన్నారు. పేదలకు భూమి విద్య ఉద్యోగ అవకాశాలు ప్రతి ఒక్కరికి అందుకుంటే దశల వారి పోరాటానికి సిద్ధమని ప్రభుత్వాన్ని డిమాండ్ ఈ కార్యక్రమంలో దశంబాబు, యేసు శాంతి రాజు, దుర్గారావు , రామకృష్ణ మురికి శీను దేగల రాజు వంశి తదితరులు పాల్గొన్నారు.

# త్యాగానికి ప్రతీక బక్రీద్

దైవ మార్గంలో దేన్నైనా త్యాగం చేయటానికి సిద్ధంగా ఉండాలి..





**సీకే న్యూస్ ప్రతినిధి వైరా నియోజకవర్గం బాధావత్ హోథిరాం నాయక్:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైరా నియోజకవర్గం జూలూరుపాడు మండలం కేంద్రంలోని ఈద్గా వద్ద జూలూరుపాడు జామ మసీద్ మౌలానా షేక్ అరీఫ్ పాపకొల్లు మసీదు మౌలానా మొహమ్మద్ కలి లూల్ రహిమాన్ ఆధ్వర్యంలో సామూహిక బక్రీద్ ఈద్ ఉల్ ఆదాహే ప్రత్యేక నమాజ్ జరిగింది

### నేడే బక్రీద్ పర్వదినం

ముస్లిం సోదరులు అత్యంత పవిత్రంగా నిర్వహించుకునే పండగల్లో మొదటిది ఈద్ ఉల్ ఫితర్(రంజాన్). రెండోది ఈద్ ఉల్ అజా(బక్రీద్). రంజాన్లో దైవాన్ని సంతుష్ట పర్చటానికి అత్యంత కఠిన ఉపవాసాలు చేయటంతో పాటు దానధర్మాలు ఎక్కువగా చేస్తారు. అందుకే దాన ధర్మాల నెలగా రంజాను భావిస్తారు. ఇక బక్రీద్ పండగను ప్రతి ఏడాది 'హిజ్రా' క్యాలెండర్ను అనుసరించి పన్నెండో నెల జిల్హాజ్ పదిన అత్యంత ఘనంగా నిర్వహిస్తారు. ఈ పండగను త్యాగాలకు గుర్తుగా చేసుకోవడం ఆనవాయితీ. అల్లాను సంతుష్ఠ పర్చటానికి, ఆయన మార్గంలో త్యాగాలను చేయాల్సిన పండగగా భావిస్తారు. బక్రీద్ పండగ రోజు ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనల అనంతరం జంతువులను త్యాగం చేయటంలో భాగంగా వాటిని కోసి మాంసాన్ని నిరుపేదలకు, బంధువులకు, ఇరుగుపొరుగు వారికి అందజేస్తారు. మనలో ఉన్న చెడును సైతం త్యాగం చేసి సజ్జనులుగా జీవించాలనేదే బక్రీద్ పండగ సందేశం. దైవాజ్ఞకు లోబడి ఆ అల్లాహ్కు విశ్వాసంగా ప్రతి ముస్లిం పరోపకార బుద్ధితో, శాంతియుత జీవితం గడుపుతూ సమాజ శ్రేయస్సు కోసం ఎంతటి త్యాగానికైనా సిద్ధంగా ఉండాలనే సందేశాన్ని ఈ పండగ తెలియజేస్తుంది. ముస్లింలంతా జిలాజ్ మాసంలో చంద్రమానం ప్రకారం పండగను ఘనంగా పవిత్రంగా నిర్వహిస్తారు. అత్యంత పవిత్రంగా భావించే 'హజ్' యాత్ర ఇదే నెలలో చేస్తారు. హజ్ యాత్రకు వెళ్లిన యాత్రికులు సైతం పవిత్ర స్థలమైన మక్కాలోనూ జంతువులను అక్కడే కొనుగోలు చేసి ఖుర్బానీ(త్యాగం) చేస్తారు.

### ఇస్లాం విశ్వాసాల ప్రకారం..

పూర్వం ప్రవక్త ఇబ్రాహిం అలైహిస్సలాం అల్లాహ్ అత్యంత విశ్వసనీయత కలిగి ఉండే వారు. ఆ అల్లా ఆయనకు పెట్టిన ఎన్నో కఠిన పరీక్షల్లో నెగ్గి విశ్వసనీయతను చాటుకున్నారు. ఈ నేపథ్యంలో ఆయనకు వచ్చిన ఒక కలలో అతనికి అత్యంత ఇష్టమైన దానిని త్యజించమని ప్రవక్త ఇబ్రాహిం అలైహిస్సలాంను దేవుడు ఆదేశిస్తాడు. ఆయనకు అత్యంత ప్రీతిపాత్రుడు ఒక్కగానొక్క కుమారుడు ఇస్మాయిల్ అలైహిస్సలాం. దైవాజ్ఞ శిరసావహించటానికి సంసిద్ధుడైన ఆయన తన కుమారుడు ఇస్మాయిల్ అలైహిస్సలాంను తోడ్కొని దైవాజ్ఞ నెరవేర్చటానికి ఉదయమే బయలు దేరుతాడు. దైవాజ్ఞ ప్రకారం తన కుమారుడిని అల్లా పేరిట ఖుర్బానీ (త్యాగం) చేయటానికి సిద్ధమవుతాడు. వాస్తవానికి అల్లా ఇబ్రాహింను అతని కొడుకును త్యాగం చేయమని కోరలేదు. అతనికిష్టమైనది మాత్రమే త్యజించమని ఆదేశిస్తాడు. కాని తనకు కొడుకే అత్యంత ప్రీతిపాత్రుడు కాబట్టి కుమారుడిని ఖుర్బానీ ఇవ్వటానికి సిద్ధపడతాడు. తన కుమారుడితో నిర్జన ప్రదేశానికి చేరుకున్నాక విషయాన్ని ఇస్మాయిల్ అలైహిస్సలాంకు వివరించగా దైవాజ్ఞ దిక్కరణ ఎట్టి పరిస్థితుల్లోనూ చేయవద్దని, తాను దైవాజ్ఞ ప్రకారం త్యాగం(ఖుర్బాన్) అవ్వటానికి సిద్ధంగా ఉన్నానంటాడు. కొడుకు మీద ఉన్న ప్రేమ దైవాజ్ఞ దిక్కరించేలా చేస్తుందేమోనన్న భయంతో ప్రవక్త ఇబ్రాహిం అలైహిస్సలాం తన కళ్లకు గంతలు కట్టుకొని ఖుర్బానీ కార్యం పూర్తి చేస్తాడు. అనంతరం కళ్ల గంతలు తొలగించి చూసేటప్పటికి తన కుమారుడు క్షేమంగా ఉండి, అతనుండాల్సిన స్థానంలో పొట్టేలను చూసి దేవుడు మరో సారి తన విశ్వసనీయత పరీక్షించటానికే ఇలా ఆదేశించాడని భావించి కృతజ్ఞతలు తెలుపుతాడు. అతడి త్యాగనిరతికి దైవం మెచ్చి కుమారుడిని క్షేమంగా అప్పగించాడని భావిస్తాడు. ఆ నాటి నుంచి ఏటా ఖుర్బానీ ఆనవాయితీ కొనసాగుతోంది.

### పవిత్రంగా భావిస్తారు

ఖుర్బానీ చేసిన జంతువు మాంసాన్ని మూడు భాగాలుగా విభజిస్తారు. ఒక భాగం మాత్రమే కుటుంబ సభ్యులు ఉంచుకుంటారు. మిగిలిన రెండు భాగాల్లో ఒకటి బంధుమిత్రులకు, మరొకటి నిరుపేదలకు పంపిణీ చేస్తేనే ఖుర్బానీ పరమార్థం పూర్తవుతుంది. విధిగా పంపిణీ చేస్తారు. జంతువుకు సంబంధించిన చర్మం ఆధ్యాత్మిక పాఠశాలలకు లేదా స్వచ్ఛంద సంస్థలకు అందజేస్తారు. వారు చర్మాన్ని విక్రయించి ఆ డబ్బును సామాజిక కార్యక్రమాలకు
చర్మాన్ని విక్రయించి ఆ డబ్బును సామాజిక కార్యక్రమాలకు వినియోగిస్తుంటారు. ఖుర్బానీ మాంసాన్ని పవిత్రంగా భావిస్తారు.

### దైవ మార్గంలో నడవాలి...

త్యాగాలకు గుర్తుగా బక్రీద్ పండగ నిర్వహిస్తారు. త్యాగంతో పాటు మనలోని చెడును సైతం త్యజించాలి. అప్పుడే ఆ అల్లా సంతుష్టుడవుతాడు. అల్లా ఆజ్ఞను శిరసావహించిన వారమై దేవుడిపై విశ్వసనీయత చాటిన వారమవుతాం. దైవ మార్గంలో దేన్నైనా త్యాగం చేయటానికి సిద్ధంగా ఉండాలి. మతాలతో సంబంధం లేకుండా అన్ని మతాల వారు దేవుడి ఆజ్ఞను ధిక్కరించకుండా శాంతి, సామరస్యాలతో దైవ మార్గంలో జీవించాల్సిన అవసరం ఉంది. అప్పుడే వారు నమ్మిన దేవుడు సంతుష్ఠుడవుతాడు.

## త్యాగానికి, సామరస్యానికి ప్రతీక బక్రీద్

- ప్రజాస్వామ్యాన్ని ఖూని చేసే కుట్రలను సమిష్టిగా ఎదుర్కొందాం.
- సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కూనంనేని సాంబశివరావు.
- బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన కూనంనేని.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూన్ 17,** కొత్తగూడెం : త్యాగానికి, సామరస్యానికి ప్రతీక బక్రీద్ పండుగ అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. బక్రీద్ పండుగను పురస్కరించుకొని సోమవారం పట్టణ పరిధిలోని బొడగుట్ట, రుద్రంపూర్ ఈద్గా, మసీదుల్లో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ముస్లీం సోదరులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ ప్రజా స్వామ్య భారత దేశంలో అన్ని పండుగలకు కులమతాలకతీతంగా జరుపుకోవడం హర్షణీయమన్నారు. రాగద్వేశాలు వీడనాడి ప్రతి ఒక్కరు సామరస్యా భావాలతో కలిసి మెలిసి జీవించాలని తద్వారా సమాజంలో శాంతిని నెలకొల్పాలన్నారు. పేద, ధనిక తారాత్యమ లేకుండా పండుగ ఉత్సవాలను అందరూ జరుపుకోవాలని, పండుగలు జరుపుకునే స్థితిలో లేని పేదలకు తమవంతు కర్తవ్యంగా తోడ్పాటును అందించి పండుగ వేడుకల్లో భాగస్వామ్యం చేయడం అభినందనీయమన్నారు. కేంద్రంలోని మోడీ సర్కార్ ముస్లిం మైనార్టీలను దేశ ద్రోహులుగా ముద్రిస్తూ వెలివేసే కుట్రలకు పాల్పడుతోందన్నారు. కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టి పబ్బంగడుపుకునే నీచ రాజకీయాలకు పాల్పడుతోందని, ఈ కుయుక్తులను కలిసికట్టుగా తిప్పికొట్టాలని, 3.0 మోడీ ప్రభుత్వంతో మరింత ప్రమాదం ఏర్పడబోతున్న పరిస్థితిలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. కూనంనేని వెంట సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె.సాబీర్ పాషా, ముస్లీం మైనార్టీ నాయకులు, పెద్దలు నయిమ్ ఖురేషి, ఫారూఖ్ యజ్దాని, అమీర్, అన్వర్, సాదికుల్లా హుస్సేన్, ఖలీల్, ఖమర్, ఇబ్రహీం, అయూబ్, ఇక్బల్, అబ్దుల్ రబ్, గౌస్, షమీఉల్లా, బషీర్, ఆబిద్, యాసిన్, ఇస్మాయిల్, సిపిఐ జిల్లా నాయకులు కంచర్ల జమలయ్య, భూక్యా శ్రీనివాస్, ఎండి. యూసుఫ్, జహీర్, ఇర్ఫాన్, తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ న్యాయవాది నిమ్మల సోమిరెడ్డి కి బార్ ఘన నివాళి.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూన్ 17,** కొత్తగూడెం కోర్టుల్లో గత 30 సంవత్సరాలుగా న్యాయ వాదిగా ప్రాక్టీస్ చేస్తూ నిన్న మృతి చెందిన నిమ్మల సోమిరెడ్డి భౌతిక కాయానికి కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ పూల మాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వామపక్ష రాజకీయాల్లో పని చేసిన సోమి రెడ్డి, క్రియాశీలక పాత్ర పోషించారని ఆ తరువాత న్యాయవాదిగా స్థిర పడ్డారని ఆయన అన్నారు. న్యాయవాదిగా ఉన్న సోమిరెడ్డి కాంగ్రెస్ పార్టీలో ఆ నాటి శాసన సభ్యులు రాం రెడ్డి వెంకట రెడ్డికి ముఖ్య అనుచరునిగా ఉన్నారని ఆయన గుర్తు చేశారు. అనుభవం ఉన్న ఒక సీనియర్ న్యాయవాదిని కోల్పోవటం తీరనిలోటని అని అన్నారు, కొత్తగూడెం బార్ సోమిరెడ్డి మృతికి ప్రగాఢ సంతాపాన్ని తెలియచేస్తున్నదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు తోట మల్లేశ్వర కార్యదర్శి ఎంఎస్ఆర్ రవిచంద్ర, వివి సుధాకర్, రావు గాజుల రామ్మూర్తి, వి పురుషోత్తమరావు, వై బాబురావు ఎస్.వి.రామారావు సంగు ఉపేంద్ర ఎస్ రమణారెడ్డి డి రమేష్ ఎల్.వి దుర్గారావు సంకు బాపన అనుదీప్ కూడా పాల్గొన్నారు.

## ముస్మిల్ సోదరులకు బక్రీద్.శు భాకాంక్షలు బుడ్డ .బాగ్యరాజు.



**చేగుంట జూన్ 17.( సీ కే న్యూస్ ) రిపోటర్ .కొండి.శ్రీనివాస్.**

- బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపిన మెదక్ జిల్లా కాంగ్రెస్ నాయకులు బుడ్డ భాగ్యరాజ్

త్యాగానికి ప్రతీక బక్రీద్ పండుగ.

అల్లా దయతో తెలంగాణ సుభిక్షంగా ఉండాలి.

ఈద్- అల్- అదా (బక్రీద్) పండుగ సందర్భంగా

మెదక్ జిల్లా కాంగ్రెస్ నాయకులు బుడ్డ భాగ్యరాజ్ ముస్లిం సోదర సోదరీమణులకు శు భాకాంక్షలు తెలిపారు . త్యాగం, సహనం ఈ పండుగ ఇచ్చే మంచి సందేశాలన్నారు.దానధర్మాలకు ప్రతీక బక్రీద్ పండుగ అని అన్నారు.త్యాగం, సేవకు చిహ్నంగా బక్రీద్ పండుగ నిలుస్తుంది అన్నారు. దైవ ప్రవక్త ఇబ్రహీం మహోన్నత త్యాగాన్ని స్మరించుకుంటూ ఈ పండుగ జరుపుకొంటారన్నారు. భక్తి భావం, విశ్వాసం, కరుణ, ఐక్యతకు సంకేతమైన ఈ పండుగను భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకోవాలన్నారు. ఈ పండుగ సోదర భావం,ఐక్యతకు ఆదర్శంగా నిలుస్తుంది అని అన్నారు. అల్లాహ్ ఆశీస్సులు ప్రజలందరికీ ఎల్లప్పుడూ ఉండాలని అభిలషించారు. అల్లా దయతో తెలంగాణ రాష్ట్రం సుబిక్షంగా ఉండాలని ప్రార్థిస్తున్నానని అన్నారు.

# నీట్ యూజీ 2024 పరీక్ష రద్దుచేయకుంటే బిజెపి ప్రజా ప్రతినిధుల ఇండ్లను ముట్టడిస్తాం.

**పి వై ఎల్ జిల్లా ఉపాధ్యక్షులు కామ్రేడ్ ముసలి సతీష్.**

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూన్ 17,** తెలంగాణలో జూన్ 4 మంగళవారం విడుదలైన నీట్ యూజీ 2024 ఫలితాలు తప్పుల తడకగా ఉన్నాయని, 67 మంది విద్యార్థులు ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంకును సాధించారని నేషనల్ ఎలిజిబులిటీ టెస్ట్ (ఎన్.టి.ఎ)ప్రకటించింది. ఈ సందర్భంగా ప్రగతిశీల యువజన సంఘం పి వై ఎల్ జిల్లా ఉపాధ్యక్షులు కామ్రేడ్ ముసలి సతీష్ మాట్లాడుతూ దీనిలో 8 మంది విద్యార్థులు ఒకే సెంటర్ కు చెందిన వాళ్లు ఉండడం గమనార్హం. అదేవిధంగా పరీక్షలో
కొంతమంది విద్యార్థులు 718,719 మార్కులు సాధించారు. నీట్ పరీక్షలో ప్రతి సరైన సమాధానానికి నాలుగు మార్కులు, అదేవిధంగా తప్పుడు సమాధాని%ఎ%కి ఒక నెగిటివ్ మార్కింగ్ ఉంటుంది. 720 పూర్తి మార్కులు సాధించిన విద్యార్థులు 68 మంది ఉన్నప్పుడు దాని తర్వాత వచ్చే ర్యాంకుల విద్యార్థులు వారి పూర్తి స్కోరు ఒక ప్రశ్నకు సమాధానం అసలే ఇవ్వకపోతే 716 మార్కులు సాధించి ఉండాలి. లేదా ఒక ప్రశ్నకు తప్పుడు సమాధానం ఇస్తే 715 మార్క్ లు వచ్చి ఉండాలి. కానీ తర్వాతి ర్యాంకులలో వచ్చిన విద్యార్థులు 719,718 మార్కులు సాధించారని ఎన్.టి.ఎ ప్రకటించిన ఫలితాలల్లో వెల్లడవుతుంది. అంటే మార్కుల ప్రకటనలో ఎన్.టి.ఎ డొల్లతనాన్ని తెలియజేస్తుంది.

పరీక్ష నిర్వహణ సమయంలో సమయం కోల్పోయిన విద్యార్థులకు గ్రేస్ మార్కులను కలిపామని అందుకే 719, 718 మార్కులు కూడా రావచ్చు అని ఎన్.టి.ఎ ప్రకటించింది. కానీ దేని ఆధారంగా, ఏ మెథడ్స్ ను ఉపయోగించి గ్రేస్ మార్కులు ఇచ్చారో స్పష్టత లేదు.



దేశవ్యాప్తంగా విద్యార్థులు నేడు ఒకే సెంటర్ నుండి 68 మంది టాపర్లు ఎందుకు ఉన్నారు, పాట్నా , గుజరాత్ ఇంకా అనేక ప్రాంతాల్లో పేపర్ లీక్ అయిందని విద్యార్థులు,తల్లిదండ్రులు ఆందోళన గురవుతున్నారు. ఇది భారతదేశంలో జరిగిన అతిపెద్ద పరీక్ష స్కామ్ గా మారింది. ఈ స్కామ్ వల్ల డాక్టర్ చదువుదామనే లక్షలాదిమంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకం అవుతుంది. ఎన్.టి.ఎ నిర్వహించిన అన్ని పరీక్షలు ఇలాగే ఉంటున్నాయి. గత సంవత్సరం సి.యు.ఈ.టి పీ.జీ ప్రవేశాల ప్రక్రియలో కూడా ఎన్.టి.ఎ ఇలానే బాధ్యతా రాహిత్యంగా వ్యవహరించింది. దేశంలో వివిధ యూనివర్సిటీలకు ఒకే పరీక్ష విధానం పెట్టడం సరైనది కాదు. నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత వివిధ పరీక్షలను సెంట్రలైజేషన్ చేస్తూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ( ఎన్.టి.ఎ)ను తీసుకొచ్చింది. ఇది నూతన జాతీయ విద్యా విధానం 2020 ప్రకారం ప్రవేశ పరీక్షలన్నీ సెంట్రలైజేషన్ చేయడంలో భాగం. దీని ద్వారా మారుమూల గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు పేద, బడుగు ,బలహీన వర్గాల విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు.ఇది పూర్తిగా కేంద్ర ప్రభుత్వ వైఫల్యమే. దేశవ్యాప్తంగా వస్తున్న విద్యార్థుల ఆందోళనలను దృష్టిలో పెట్టుకొని పరీక్షను వెంటనే రద్దుచేసి తిరిగి నిర్వహించాలని ప్రగశీల యువజన సంఘం పి వై ఎల్ జిల్లా కమిటీ డిమాండ్ చేస్తుంది. లేనిపక్షంలో నూతనంగా ఎన్నికైన బిజెపి ఎం.పి, కేంద్ర మంత్రుల ఇండ్లను ముట్టడిస్తామని హెచ్చరిస్తున్నాము. ఈ కార్యక్రమంలో ఇర్ప జయలక్ష్మి కొరసా నందిని సబ్కా చందు తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి జిల్లా అధ్యక్షులు కె.వి రంగా కిరణ్ ఆధ్వర్యంలో మూక మామిడి ప్రాజెక్టు సందర్శన.

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూన్ 17,**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం లోని మూక మామిడి ప్రాజెక్టును సోమవారం బిజెపి పార్టీ ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ యొక్క ప్రాజెక్టు సుమారు 45 సంవత్సరాల క్రితం అప్పటి ప్రభుత్వం నిర్మించడం జరిగింది కానీ గత అనేక సంవత్సరాలుగా ఈ యొక్క ప్రాజెక్టు బాగోగులు ప్రభుత్వాలు పట్టించు కోవడం లేదు అని మూకమామిడి గ్రామస్తులు బిజెపి కార్యకర్తలు బిజెపి జిల్లా అధ్యక్షులు కెవి రంగా కిరణ్ దృష్టికి తీసుకెళ్లగా ఈరోజు ప్రాజెక్టును సందర్శించి పూర్తిగా పరిశీలించారు అనంతరం రంగా కిరణ్ మాట్లాడుతూ సుమారు 45 సంవత్సరాల క్రితం 160 మిలియన్ క్యూబిక్ ఫీట్ సామర్థ్యంతో అప్పటి ప్రభుత్వం ఈ మూక మామిడి ప్రాజెక్టు నిర్మించింది అని ఈ యొక్క ప్రాజెక్టు కింద సుమారు పది గిరిజన గ్రామాలకు వ్యవసాయ అవసరాలు తీరతాయని అన్నారు ఈ యొక్క ప్రాజెక్టు సుమారు 378 ఎకరాల్లో విస్తరించి ఉందని ఈ యొక్క ప్రాజెక్టు వర్షాధారిత ప్రాజెక్ట్ అని ఈ మూకమామిడి ప్రాజెక్టు పూర్తిగా నిండితే అలుగుద్వారా సుమారు 15,570 క్యూసెక్కుల నీరు వెళుతుందని ఈ ప్రాజెక్టు కుడి ఎడమ కాలువల ద్వారా గిరిజన ప్రాంతాలైన 10 గ్రామాలకు నీరు అందుతుందని అన్నారు ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 3260 ఎకరాల సాగు జరుగుతుందని దానిలో 13 నుంచి 1400 ఎకరాలు వరి సాగు మరియు మిగిలిన సుమారు 1800 ఎకరాలు పల్లి బొబ్బర పంటలు పండుతాయి అని అన్నారు ఈ యొక్క ప్రాజెక్టు బాగోవుల కోసం గత ప్రభుత్వం 2019 వ సంవత్సరంలో సుమారు 9 కోట్ల చిల్లర మంజూరు చేసిందని దానిలో 6 కోట్లు పనులు పూర్తయ్యాయని అన్నారు ఇంకొక మూడు కోట్ల పనులు చెయ్యవలసి ఉంది అని అదేవిధంగా ఈ ప్రాజెక్టు నుంచి కుడి మరియు ఎడమ కాలువకు నీరు పోయే మార్గం దగ్గర గేట్లకు సంబంధించిన మిషనరీస్ మొత్తం శిథిలావస్థలో ఉన్నాయని అందువలన ప్రాజెక్టులోని నీరు మొత్తం అవసరం ఉన్న లేకున్నా ఈ రెండు కాలువల ద్వారా నీరు ఎప్పుడు బయటకు పోతుందని తద్వారా రైతులకు అవసరం ఉన్నప్పుడు నీరు ఉండటం లేదని అన్నారు. ఈ యొక్క ప్రాజెక్టు కట్టినప్పటి నుండి పైనున్న వాగుల ద్వారా నీరుతో పాటు ఈ యొక్క ప్రాజెక్టులో కి మట్టి కూడా భారీ ఎత్తున చేరుకుంటుందని అన్నారు. సుమారు ఈ యొక్క ప్రాజెక్టులో రెండున్నర లక్షల క్యూబిక్ మీటర్లు పూడిక తీయాల్సిన అవసరం ఉందని ఈ ప్రాజెక్టు పేరుకు మాత్రమే ప్రాజెక్టు కానీ ఇది ఒక పెద్ద చెరువు లాగా ఉంటుంది కాబట్టి టెక్నికల్ గా ప్రాజెక్టులో మట్టి తీసే పద్ధతి లేకున్న ఈ మూకమామిడి ప్రాజెక్టు ఒక పెద్ద చెరువు లాగా ఉంటుంది కాబట్టి ఇరిగేషన్ శాఖ వారు రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఈ ప్రాజెక్టులో కనీసం రెండు లక్షల క్యూబిక్ మీటర్లు మట్టిని తొలగిస్తే ఈ యొక్క ప్రాజెక్టు ఎప్పుడు నిండుగా ఉంటుందని తద్వారా ఈ ప్రాజెక్టు దిగువన ఉన్న సుమారు 10 గిరిజన గ్రామాలలో వ్యవసాయ అవసరాలు తీరుతాయని అన్నారు. అదే విధంగా ఈ యొక్క ప్రాజెక్టులో కట్టిన వంతెన పిల్లర్స్ సేఫ్టీ పైపులు మొత్తం కూడా శిథిలావస్థకు చేరుకుంటున్నాయని భవిష్యత్తులో ఇవి కూలిపోయే ప్రమాదం ఉందని కనుక తక్షణమే ప్రభుత్వం స్పందించి సంబంధిత ప్రభుత్వ అధికారులతో నివేదికలు తెప్పించుకొని ఈ మూక మామిడి ప్రాజెక్టుకు అవసరం ఉన్న అన్ని పనులు చేయవలసిందిగా బిజెపి పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నామని అన్నారు .ఈ ప్రాజెక్టు మొత్తం కూడా అడవిలో ఉండడం తోటి పాల్వంచ లోని కిన్నెరసాని ప్రాజెక్టు లాగా పర్యాటక ప్రాంతం చేస్తే బాగుంటుందని గతంలో కూడా స్థానిక అధికారులు సుమారు 20 కోట్లతో కూడిన ప్రతిపాదనలు గత ప్రభుత్వాలకు నివేదించడం జరిగిందని అయినా సరే గత ప్రభుత్వాలు ప్రస్తుత ప్రభుత్వం ఆలోచన చేయడం లేదని అన్నారు. ప్రాజెక్టు పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందాలంటే తక్షణమే ప్రభుత్వం 50 కోట్ల రూపాయలు మంజూరు చేసి ఈ మూక మామిడి ప్రాజెక్టుని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాల ని కోరుతున్నాము ఈ మూక మామిడి ప్రాజెక్టు పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందితే స్థానిక గిరిజన గ్రామాలు మరియు గిరిజనులు ఆర్థికంగా కూడా అభివృద్ధి చెందుతారని అన్నారు .ఈ ప్రాజెక్టు కు అవసరమైన పనులకు మరియు ఈ యొక్క ప్రాజెక్టును పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దడానికి అవసరమైన వనరులను ఈ ప్రభుత్వం మంజూరు చేసేదాకా బిజెపి పార్టీ తరఫున పోరాటం చేస్తామని తెలియజేస్తున్నాము. రానున్న రెండు మూడు రోజుల్లో ఇరిగేషన్ మరియు పర్యాటక శాఖ వారికి



బిజెపి పార్టీ తరఫున ఈ సమస్యను మొత్తం కూడా వారి దృష్టికి తీసుకుపోయి ఈ మూక మామిడి ప్రాజెక్టు కు సంబంధించి నీటి నిలువ వ్యవహారంగాని మూక మామిడి ప్రాజెక్టు యొక్క కుడి ఎడమ కాలువల మరమ్మత్తులు గాని అదేవిధంగా అలుగు ,తూము ప్రాజెక్టు లో ఉన్న వంతెన యొక్క మర మత్తుల కోసం సంబంధిత జిల్లా మరియు రాష్ట్ర అధికారులకు సంబంధిత మంత్రులకు బిజెపి పార్టీ ఆధ్వర్యంలో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయనున్నామని తెలిపినారు. భవిష్యత్తులో మూక మామిడి కి సంబంధించిన అభివృద్ధి పర్యాటక పనులను ఈ పాలకులు పూనుకోకపోతే బిజెపి పార్టీ ఆధ్వర్యంలో స్థానిక ప్రజలను కలుపుకొని భారీ ఉద్యమాలు చేస్తామని తెలియజేస్తున్నాం ఈ యొక్క కార్యక్రమం లో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి తాటిపాముల ఐలయ్య, జిల్లా ఉపాధ్యక్షులు బిజ్జంశ్రీనివాస్ రెడ్డి, జిల్లా కార్యదర్శి కేశగాని శ్రీనివాస్ గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి పొనిశెట్టి వెంకటేశ్వర్లు, చుంచుపల్లి మండల అధ్యక్షులు రాయుడు నాగేశ్వరరావు, సుజాతనగర్ మండల అధ్యక్షులు భూక్య రాజేష్, పాల్వంచ మండల అధ్యక్షులు పోలోజు క్రాంతి, పాల్వంచ పట్టణ అధ్యక్షులు రాపాక రమేష్, బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర నాయకులు కటికల రంజిత్, ములకలపల్లి మండల ప్రధాన కార్యదర్శిలు గుగులోత్ శంకర్, శనగపాటి సీతారాములు, పాల్వంచ పట్టణ ప్రధాన కార్యదర్శి మాదారపు లక్ష్మణ్, నరేందర్, కమురుద్దీన్, తోట వెంకటేశ్వర్లు, పొన్నూరు భాను తేజ, పూణెం నవీన్, వట్టెం వంశీ, అనంతుల విజయ్, రింగు పవన్, జరుపుల శివ, ఎర్రం శెట్టి శివ, జాటోత్ రవి తదితరులు పాల్గొన్నారు

# పీకేఓసి ను పర్యటించిన సింగరేణి డైరెక్టర్ (ఆపరేషన్స్) మరియు (పి ఏ డబ్ల్యు).

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూన్ 17,**సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో పీకేఓసి-2 మరియు పికేఓసి- 4 ఉపరితల గనుల వ్యూ పాయింట్ నుండి బొగ్గు ఉత్పత్తి ప్రక్రియను డైరెక్టర్ (ఆపరేషన్స్) మరియు (పి ఏ డబ్ల్యు) ఎసివికే శ్రీనివాస్ , మణుగూరు ఏరియా ఇంచార్జ్ జనరల్ మేనేజర్ టి. లక్ష్మీపతి గౌడ్ మరియు సంబందిత అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ పర్యటనలో భాగంగా ముందుగా జనరల్ మేనేజర్ ఛాంబర్ లో ఏరియా ఉన్నత అధికారులతో జరిగిన రివ్యూ మీటింగ్ లో డైరెక్టర్ (ఆపరేషన్స్) మరియు (పి ఏ డబ్ల్యు) ఎన్ వికే శ్రీనివాస్ మాట్లాడుతూ వార్షిక లక్ష్యాల సాధనకు ఇప్పటినుండే ఉత్పత్తి, ఉత్పాద కతకై ప్రత్యేక దృష్టి పెట్టి నెల వారి లక్ష సాధనను టేరీజు వేసుకుంటూ క్రమ క్రమంగా ఉత్పత్తి పెంచుకోవడం వల్ల లక్ష సాధన సులభతరం అవుతుంది కాబట్టి ప్రణాళిక బద్ధంగా బొగ్గు ఉత్పత్తికి పాటు పడుతూ సమిష్టి కృషితో లక్ష్యానికి మించిన అధిక ఉత్పత్తి కి కృషి చేయాలని సూచించారు.ఈ సందర్భంగా ఆయా గనుల సంబందిత అధికారుల తో మాట్లాడుతూ... మణుగూరు ఏరియా నుండి ఏటా పెరుగుతున్న బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించటానికి శ్రామిక శక్తితో పాటు యాంత్రిక శక్తి కూడా ఎంతో అవసరం కాబట్టి ఏరియా నుండి అధికోత్పత్తి కి అవసరమైన అన్నీ రకాల వనరులను యాజమాన్యం వెనువెంటనే ఆమోదం తెలుపుతూ ఉంది. కావున, సింగరేణి మొత్తంలో అధికోత్పత్తి సాధనలో అగ్ర భాగంగా నిలిచిన మణుగూరు ఏరియా 2024-25 సంవత్సరపు ఏరియా నిర్దేశిత వార్షిక లక్ష్యమైన 126.5 లక్షల టన్నుల టార్గెట్ ను చేరుకొనుటకు అధికారులు, కార్మికులు, సూపర్ వైజర్లు సమిష్టి కృషితో అధికోత్పత్తికి పాటు పడాలి అన్నారు. అలాగే బొగ్గు ఉత్పత్తి మరియు సరఫరాల ప్రక్రియలో వర్షాకాలం వల్ల ఆటంకం కలగకుండా వరద నీటిని వెను వెంటనే సంపులకు చేర్చటం మరియు ఆ నీటిని పంపుల ద్వారా పైకి చేరవేయటానికి సరిపడా మోటార్ల ను సిద్ధంగా ఉంచుకోవాలి అలాగే డంపర్లు తిరిగే రహదారుల పై బురద నీరు చేరితే భారీ వాహనాలు స్కిడ్ అయ్యి ప్రమాదలకు గురి అయ్యే అవకాశం ఉంది కాబట్టి వరద నీరు వెళ్ళేందుకు రహదారుల ఇరువైపుల కాలువలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.



ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ నర్సి రెడ్డి, ఎస్ ఓ టు జి ఎం శ్యామ్ సుందర్ , ఓ సీ 2 ప్రాజెక్ట్ మేనేజర్ రాంబాబు , ప్రాజెక్ట్ ఇంజినీర్ వీరభద్రుడు, పికేఓసి-2 మేనేజర్ సురేశ్ , సర్వే అధికారి చిట్టా శ్రీనివాస్ , ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పాయం రాములమ్మ పార్థీవ దేహానికీ నివాళులు అర్పించిన కరకగూడెం కాంగ్రెస్ పార్టీ నాయకులు.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూన్ 17,**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో పినపాక నియోజకవర్గ శాసన సభ్యులు పాయం వెంకటేశ్వర్లు మాతృమూర్తి పాయం రాములమ్మ మరణించగా వారి పార్థివ దేహనికి పూల మాల వేసి నివాళులర్పించి, ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుని మరియు కుటుంబ సభ్యులను పరామర్శించిన కాంగ్రెస్ పార్టీ కరకగూడెం మండల అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్.
ఈ కార్యక్రమంలో బట్టుపల్లి మాజీ సర్పంచ్ నియోజకవర్గ నాయకులు తోలెం నాగేశ్వరరావు , మండల యువజన అధ్యక్షులు కునుసోత్ సాగర్, మండల నాయకులు భూక్య అర్జున్ తదితరులు పాల్గొన్నారు..

# మరోసారి మానవత్వం చాటుకున్న కడాలి నాగరాజు.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూన్ 17,**భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానానికి దగ్గరలో ఉన్న శివాలయం దగ్గర బిక్షాటన చేసుకుని జీవిస్తున్న ఒక వృద్ధుడు నాలుగు రోజుల క్రితం కాలుజారి పడిపోవడం జరిగినది, మెట్ల మీద నుంచి పడిపోవడం వల్ల నడుము కింద భాగాన బోన్ ఫ్యాక్చర్ అయినది, నడవలేని పరిస్థితిలో భిక్షాటన చేసుకునే ప్లేస్లో కూల బడిపోయి ఉన్నాడు, సోమవారం కుసుమ హరినాథ్ బాబా ఆలయ అర్చకులు నరసింహమూర్తి సమాజ సేవకుడు నాగరాజు కి ఫోన్ చేసి విషయం చెప్పినారు, వెను వెంటనే నాగరాజు అక్కడికి చేరుకొని ఆయన్ని పరామర్శించి ఎలా ఉన్నదని అడిగి తెలుసుకుని వెంటనే 108 కి ఫోన్ చేసి వాహనం వచ్చేదాకా ఉండి వారి సహాయంతో 108 లోకి ఎక్కించుకొని గవర్నమెంట్ హాస్పిటల్ కి తీసుకువెళ్లి డ్యూటీ డాక్టర్ కి విషయం తెలియజేసి పెద్దాయనకి సిమెంట్ కట్టు వేయాలని చెప్పి 45 రోజులు పాటు మీ హాస్పిటల్ లోనే చూసుకుంటూ ఆయనకి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్ ని వేడుకని హాస్పిటల్లో జాయిన్ చేసినాడు.

# సీనియర్ జర్నలిస్ట్ యల్కా సైదులు మృతి బాధాకరం

- సైదులు మృతి పట్ల పలువురు సంతాపం
- ఘనంగా నివ్వాలర్పించిన జర్నలిస్టు మిత్రులు
- శోక సముద్రంతో సాగిన నిఖార్సైన జర్నలిస్టు అంతిమ యాత్ర



**సికె న్యూస్ సూర్యాపేట జిల్లా ప్రతినిధి (రామయ్య) జూన్ 17:**హుజూర్ నగర్ పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ యల్క సైదులు సోమవారం తెల్లవారు జామున గుండె పోటుతో మృతి చెందారు. యల్క సైదులు వివిధ పత్రికల్లో చానల్స్ లో జర్నలిస్ట్ గా పనిచేసి స్వతహాగా అక్షర సమరం పేపరు స్థాపించి హుజూర్ నగర్ నయోజకవర్గంలో వివిధ ప్రజా సమస్యలను వెలికి తీసి అవినీతి అక్రమాలపై తన దైన శైలిలో వార్త కథనాలు రాసి నిఖార్సైన జర్నలిస్ట్ గా మంచి గుర్తింపు పొందారు. జర్నలిస్ట్ యల్క సైదులు మృతి పట్ల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సంతాపం ప్రకటించారు. పట్టణ ప్రముఖులు వివిధ పార్టీల నాయకులు జర్నలిస్టులు బంధుమిత్రులు సైదులు కు ఘన నివాళులు అర్పించారు.

# జటప్రోలు గ్రామంలో భక్తి శ్రద్ధలతో "బక్రీద్" వేడుక



సీకే న్యూస్ ప్రతినిధి, పెంట్లవెల్లి: స్థానిక మండల పరిధిలోని జటప్రోలు గ్రామంలో ఉన్న ఈద్గా దగ్గర సోమవారం గ్రామ ముస్లిం సోదరులు బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని నూతన వస్త్రాలు ధరించుకుని భక్తి శ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించారు అనంతరం గ్రామ ముస్లిం సోదరులు మాట్లాడుతూ త్యాగానికి సత్యానికి ఐక మత్యానికి ప్రతీక ఈ బక్రీద్ అన్నారు మహమ్మద్ ప్రవక్త దైవ సూక్తులను స్మరించుకుంటూ ఈ పర్వ దినాన్ని సంతోషంగా జరుపుకున్నామని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామ ముస్లిం సోదరులు చిన్నారులు యువకులు పెద్దలు తదితరులు పాల్గొన్నారు

# సీజన్ వ్యాధుల పై విద్యార్థులు అప్రమత్తం గా ఉండాలి.



సి కే న్యూస్ ఇల్లందు నియోజకవర్గ ప్రతినిధి, జూన్ 17, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ జేవీఎల్ శిరీష జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ మలేరియా అధికారి శ్రీనివాసరావు ఆదేశానుసారం రాబోయే వర్షాకాలంలో గురుకుల పాఠశాలల్లో మరియు వసతి గృహాలల్లో ఉండి చదువుకునే విద్యార్థిని విద్యార్థులను కీటక జనిత వ్యాధుల నుండి కాపాడుకోవడం కోసం ముందస్తు చర్యలలో భాగంగా ఆల్ఫా సైఫర్ మిత్రిన్ ఇండోర్ రేసిడ్యూల్ స్ప్రే (%ూజవీ%) అనే మందును టేకులపల్లి మండలంలోని వసతి గృహాలలో సోమవారం పిచికారి చేయడం జరిగింది. ఈ మందు పిచికారి చేయడం వల్ల దోమ కాటు ద్వారా వచ్చే వ్యాధులు అయినా మలేరియా డెంగ్యూ, గున్యా, మెదడు, వాపు బోదకాలు తదితర వ్యాధుల నుండి రక్షణ పొందవచ్చు అనిమండల వైద్యాధికారి డాక్టర్ కందుల దినేష్ అన్నారు సోమవారం మహాత్మా గాంధీ జ్యోతిబాపూలే బాయ్స్ హాస్టల్ కస్తూరాబాద్ గాంధీ బాలికల హాస్టల్ సెల్ఫ్ మేనేజ్మెంట్ గర్ల్స్ హాస్టల్ సెల్ఫ్ మేనేజ్మెంట్ బాయ్స్ హాస్టల్ బద్దుతండలోని ఏకలవ్య గురుకులం కోయగూడెం ఆశ్రమ పాఠశాల నందు పిచికారి చేయడం జరిగింది చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ కందుల దినేష్ ఇల్లందు సబ్ యూనిట్ అధికారి హరికృష్ణ సూపర్వైజర్లు పోరండ్ల శ్రీనివాస్ నాగబండి వెంకటేశ్వర్లు ప్రిన్సిపల్ లు భద్రయ్య సంతు చైతన్య భరత్ సైదులు వైద్య సిబ్బంది దానసరి రాంబాబు రమా కుమారి స్వప్న చంద్రకళ ఆశా కార్యకర్తలు లక్ష్మి మంగ కవిత తదితరులు పాల్గొన్నారు.

# చేనేత కార్మికులను ఆదుకోవాలని ఎమ్మెల్యేకు వినతి



సీకే న్యూస్ : చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిసిసిబి డైరెక్టర్ చేనేత సహకార సంఘం అధ్యక్షులు పిల్లలమర్రి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని హైదరాబాదులో గల వారి నివాసంలో కలిసి చేనేత కార్మికుల సమస్యలు. చేనేత సహకార సంఘంలో కూరుకుపోయిన నిలువలను తక్షణమే ప్రభుత్వం కొనుగోలు చేయవలసిందిగా, చేనేత సహకార సంఘాలకు ఇవ్వవలసిన బకాయిలను టెస్కో త్వరగా చెల్లించే విధంగా కృషి చేయాలని . చేనేత సహకార సంఘాలకు రుణమాఫీ చేయాలని వారి దృష్టికి తీసుకురావడం జరిగినది. ఈ సందర్భంగా వారుమాట్లాడుతూ.. గత కెసిఆర్ ప్రభుత్వం చేనేత సహకార సంఘాల నిర్వీర్యం చేసి కోలుకోలేని స్థితిలో నెట్టివేసిన గత టిఆర్ఎస్ ప్రభుత్వం పై వారు మండిపడినాడు. గతంలో ఎమ్మెల్యేగా కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఉన్నప్పుడు చేనేత సహకార సంఘంలకు మరియు కార్మికులకు ఉమ్మడి రాష్ట్రంలో 350 కోట్ల రుణమాఫీ చేసిన విషయం గుర్తు చేసినారు. త్వరలో మంత్రి వర్గ విస్తరణలో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రివర్గంలో స్థానం దక్కాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా, డిసిసిబి డైరెక్టర్, చేనేత సహకార సంఘం అధ్యక్షులు పిల్లలమర్రి శ్రీనివాస్, పోచంపల్లి చేనేత సహకార సంఘం మాజీ అధ్యక్షులు భారత వాసుదేవ్, కొయ్యలగూడెం చేనేత సహకార సంఘం అధ్యక్షులు గడ్డం జయశంకర్, మాజీ ఆర్.టి.ఏ మెంబర్ తడక కిరణ్ తమిళ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి వినతిపత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు.

# మహిళా స్వయం సహాయక సంఘాలకు ఈ ఏడాది 20 వేల కోట్ల రుణాలు:- మంత్రి సీతక్క.



సి కె న్యూస్ ప్రతినిధి హైదరాబాద్: మహిళా స్వయం సహాయక సంఘాలకు ఈ ఏడాది 20 వేల కోట్ల రుణాలు అందించాలన్న లక్ష్యాన్ని పెట్టుకున్నట్లు రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి మరియు మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ (సీతక్క) తెలిపారు. గత ఏడాది కేవలం 15,400 కోట్ల రుణాలు ఇచ్చారని వెల్లడించారు. 2024-25 ఆర్థిక సంవత్సర రుణ ప్రణాళికను సీతక్క శనివారం విడుదల చేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. ఒకప్పుడు మహిళా సంఘాలకు రూ. పది వేల లోన్ ఇవ్వాలంటేనే బ్యాంకులు భయపడేవన్నారు. ఇప్పుడు మహిళా సంఘాలకు రూ. 20 లక్షల వరకు రుణాలు అందుతున్నాయన్నారు. మహిళా సంఘాలు మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచడమే కాదు.. ఐక్యతను అభివృద్ధిని సాధిస్తున్నమని సీతక్క తెలిపారు. పేదలకు పేదలే బంధువులుగా ఉంటారన్నారు. అందుకే పేదలకు ప్రభుత్వమే అండగా ఉండి అభివృద్ధి పథాన నిలపాలన్నదే మా సంకల్పమని స్పష్టం చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఇంకా మహిళా సంఘాలు బల పడాలని మంత్రి సూచించారు. ఏజెన్సీ ప్రాంతాలకే బ్యాంకర్లు వెళ్లి మహిళా సంఘాలకు లోన్లు ఇవ్వాలని ఆదేశించారు. తమ అవసరాలు తీరుస్తారనే విశ్వాసాన్ని బ్యాంకులు కల్పించాలన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా చేయడానికి కృషి చేస్తున్నామని వెల్లడించారు. అందులో భాగంగా మహిళలకు ఉపాధి అవకాశాలను పెంచుతున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల యూనిఫామ్ స్టిచ్చింగ్టిచ్చింగ్ బాధ్యతను మహిళా సంఘాలకే అప్పగించామని పేర్కొన్నారు. పాఠశాలలు తెరిచిన రోజే యూనిఫాంలు విద్యార్థులకు అందించిన చరిత్ర మహిళా సంఘాల కే దక్కుతుందని కొనియాడారు. మహిళా సాధికారతే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యమని తెలిపారు. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ముందంజలో ఉన్నపుడే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. మహిళా సంఘ సభ్యులకు జీవిత భీమా కల్పిస్తున్నామని ఉద్ఘాటించారు. కుటుంబానికి భారం కాకుండా ప్రభుత్వమే పెండింగ్ లోన్లు చెల్లిస్తుందని స్పష్టం చేశారు. మహిళలు కొత్త ఉపాధి అవకాశాలు ప్రతిపాదించండి, బ్యాంకుల ద్వారా రుణాలను ఇప్పించే బాధ్యత ప్రభుత్వానిదే అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా పక్షపాతి ప్రభుత్వమని.. ఉక్కు మహిళ ఇందిరా గాంధీ దేశానికి ప్రధానిగా సేవలందించారని గుర్తుచేశారు.

# జులై 7న వరంగల్లో జరిగే 30 ఏళ్ల మాదిగల ఆత్మగౌరవ కవాతును జయప్రదం చేయలి..

**దుబ్బ రామకృష్ణ మాదిగ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు**



సీకే న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు జూన్ 17. మండలం కేంద్రంలో ప్రెస్ మీట్ సమావేశంలో దుబ్బ రామకృష్ణ మాదిగ జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ.

రాజ్యాంగబద్ధంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారు కల్పించిన రిజర్వేషన్లు ఎస్సీ లోని అన్ని ఉపకులాలకు జనాభా నిష్పత్తి ప్రకారంగా పంపిణీ జరగాలని అస్తిత్వ ఆత్మగౌరవ పోరాటాలకు పురుడుబోసిన ఎమ్మార్పీఎస్ ఉద్యమం ఆవిర్భవించి జులై 7 నాటికి గౌరవ శ్రీ మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో ఏర్పడి నేటికీ 30 సంవత్సరాలు కావస్తుందని తెలిపారు.

ఎమ్మార్పీ ఉద్యమం ఆవిర్భవించిన నాటి నుండి కేవలం మాదిగల కోసమే కాకుండా సమాజంలో అన్ని వర్గాల ప్రజా సమస్యల మీద వృద్ధులు వికలాంగులు వితంతులు పెన్షన్ల పెంపు కోసం మరియు గుండె జబ్బు చిన్నారుల ఉచిత వైద్యం కోసం చేసినపోరాట మే ఆరోగ్యశ్రీ కార్డు రూపకల్పనకు దారిదీసిందని తెలిపారు

ఎమ్మార్పీఎస్ చేసిన పోరాటమే సమాజంలో అన్ని వర్గాలకు మేలు కలిగిందని తెలిపారు

తమ లక్ష్యసాధనైనా ఎస్సీ వర్గీకరణకు అతి త్వరలోనే నూతనంగా కేంద్రంలో అధికారంలోకి వచ్చిన గౌరవ భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఎన్డీఏ ప్రభుత్వంలో ఎస్సీ వర్గీకరణ సాధిస్తామని తమ ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

జులై 7 నాటికి ఎమ్మార్పీ శ్రేణులు గ్రామ మండల పూర్తిస్థాయి కమిటీలను పూర్తిచేసుకుని

నల్ల షర్టు బ్లాక్ పాయింట్తో డ్రెస్ కోడ్ తో జూలై 7న వరంగల్లో జరిగే మాదిగల ఆత్మగౌరవ కవాతుకు లక్షలాదిగా తరలిరావాలని విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి జిల్లావ్యాప్తంగా మాదిగ పల్లెలు రాజకీయాలకు అతీతంగా ప్రతి గ్రామం నుండి ప్రతి మాదిగ బిడ్డ వరంగల్ కేంద్రానికి తరలిరావాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో.

ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు సందెలు శ్రీనివాస్ మాదిగ యాకర్ నరసింహారావు మాదిగ ఇటుకల దేవేందర్ మాదిగ బాల నరసింహ మాదిగ జాంగిర్ మాదిగ పాముకుంట్ల బసవయ్య మాదిగ మాజీ సర్పంచ్ బిక్షపతి మాదిగ తదితరులు పాల్గొన్నారు

# నీట్ పరీక్షపై సిబిఐ విచారణ జరపాలి.

**ఎన్.ఎస్.యు.ఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు అజ్మీర సురేష్ నాయక్.**




సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూన్ 17, నీట్- 2024 ప్రవేశ పరీక్షల్లో జరిగిన అక్రమాలపై సిబిఐ తో విచారణ జరిపించాలని, నీట్ ప్రవేశ పరీక్షలు మళ్ళి నిర్వహించి విద్యార్థులకు న్యాయం చేయాలని ఎన్ఎస్.యుఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు అజ్మీర సురేష్ నాయక్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రం కొత్తగూడెం పోస్ట్ ఆఫీస్ సెంటర్ లోని అంబేద్కర్ విగ్రహం ముందు నీట్ పరీక్షల్లో జరిగిన అక్రమాలకు వ్యతిరేకంగా విద్యార్థి నాయకులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీట్ యూజీ ప్రవేశ పరీక్ష ఫలితాలు పరీక్ష ఫలితాలు నోటిఫికేషన్ ప్రకారం ఈనెల 14 విడుదల కావాల్సి ఉండగా 10 ముందుగానే ఎన్నికల ఫలితాల విడుదల రోజు చేయడం వెనుక ఉన్న కారణాలపై తమకు అనుమానాలున్నాయని మండిపడ్డారు. నీట్ యూజీ ప్రవేశ పరీక్షలో ఒక సమాధానంకు నాలుగు మార్కులు, ఒక తప్పు సమాధానానికి నాలుగు మార్కులతో పాటు ఒక్క మార్కు నెగటివ్ ఉంటుంది. కానీ ఇందులో విద్యార్థుల కు చిత్ర విచిత్రమైన మార్కులు వచ్చాయని కొంత మంది విద్యార్థులకు 718, 719 మార్కులు ఎలా వచ్చాయని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అడుగుతుంటే యూజీసీ మాత్రం గ్రేస్ మార్కులు కలిపామంటూ దాటివేసే ధోరణిలో ఉందని ఆరోపించారు. గ్రేస్ మార్కులు కలపాలనె నిబంధనల్లో లేకున్న ఎలా కలిపారో చెప్పాలని ప్రశ్నించారు. పరీక్ష ఫలితాలలో ఒకే పరీక్ష కేంద్రంలో రాసిన విద్యార్థిలకు వరుసగా ఒకే విధంగా మార్కులు రావడం ప్రవేశ పరీక్ష లోపాలను ఎత్తిచూపుతుందన్నారు. ఒకపక్క ప్రవేశ పరీక్ష పేపర్ లికేజీ అయిందని వస్తున్న వార్తలపై కేంద్ర ప్రభుత్వం విచారణ చేపట్టకుండా, విద్యార్థులకు అన్యాయం చేస్తుందని, అలాగే కోన్ని చోట్ల జరిగిన మాల్ ప్రాక్టీస్ వలన చదువుకునే విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని వారు వాపోయారు. 2024 నీట్ పరీక్షల్లో జరిగిన స్కామ్ బయపడాలంటే సిబిఐ విచారణ చేపట్టాలని, నీట్ పరీక్షను మళ్ళీ నిర్వహించాలని, బాధ్యులను కఠినంగా శిక్షించాలని, పేపర్ లీకేజిపై నరేంద్రమోదీ బాధ్యత వహించి, దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని, ఎన్ టీ ఏ ను రద్దు చేయాలని, నీట్ పరీక్ష నిర్వహణను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలని, బాధిత విద్యార్థులకు న్యాయం చేయాలనీ ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర స్థాయిలలో జరిగే ప్రవేశ పరీక్షలలో అవినీతి జరుగుతుందిని, ఈ అవినీతిని అరికట్టాలనే ఉద్దేశంతో దేశ వ్యాప్తంగా ఒకటే పరీక్ష ఉండటం వలన అవినీతిని అరికట్టవచ్చనే ఉద్దేశంతో చేపట్టిన నీట్ యూజీ పరీక్షలలో సైతం అవినీతి, అక్రమాలు జరగడం ప్రభుత్వల చేతకానితనానికి నిదర్శనమని అలాగే నీట్ ప్రవేశ పరీక్షను కేవలం హింది, ఇంగ్లీష్ లలో నిర్వహించడం వలన దక్షణాది రాష్ట్రాల విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. నీట్ యూజీ పరీక్షను స్థానిక బాషలలో కూడా నిర్వహించి దక్షణాది రాష్ట్రాల ప్రజలకు న్యాయం చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్.యుఐ నాయకులు లావుడియా గౌతమ్, జహీర్, మాలిక్ దీపక్, లావుడియా శశివర్ధన్, కందాల విజయ్ కుమార్, సన్నీ, కాటీ సందీప్, షేక్ షాన్ వాజ్, సమీర్, తదితరులు పాల్గొన్నారు...


# భార్య కంట్లో పడ్డ భర్త నిర్వాకం.. యాపిల్ కంపెనీపై భర్త దావా!

**సెక్స్ వర్కర్ తో చాటింగ్ ను డిలీట్ చేసిన భర్త**

**ఐమెసేజెస్ సింక్రనైజేషన్ వల్ల భార్యకు దొరికిపోయానని వెల్లడి**

**భర్త నిర్వాకంతో విడాకులకు దరఖాస్తు చేసిన భార్య**

**ఇదంతా యాపిల్ కంపెనీ వల్లేనని ఆరోపిస్తున్న భర్త**



ఇంగ్లాండ్ కు చెందిన ఓ బిజినెస్ మ్యాన్ పై ఆయన భార్య విడాకుల దావా వేసింది. దీనివల్ల తనకు భార్య దూరమవడమే కాక ఆర్థికంగా కూడా నష్టం వాటిల్లుతోందని భర్త వాపోయాడు. దీనికి అంతటికీ కారణం యాపిల్ కంపెనీయేనంటూ కోర్టుకెక్కాడు. ఏకంగా 5 మిలియన్ డాలర్ల పరిహారం కోరుతూ దావా వేశాడు. భార్య విడాకులు కోరితే భర్త యాపిల్ కంపెనీపై దావా వేయడమేంటని అనుకుంటున్నారా.. పూర్తిగా చదివేసేయండి మరి..

ఇంగ్లాండ్ వ్యాపారవేత్త తన ఇంట్లోని ఐమ్యాక్ తో ఓ సెక్స్ వర్కర్ తో ఛాటింగ్ చేశాడు. పనయ్యాక ఆ మెసేజ్ లు అన్నీ డిలీట్ చేశాడు. తన ఘనకార్యం ఎవరికంటా పడదని, ముఖ్యంగా భార్యకు తెలిసే అవకాశం లేదని నిశ్చింతగా ఉన్నాడు. అయితే, యాపిల్ కంపెనీ ఉత్పత్తుల్లో ఐమెసేజెస్ కు ఓ సౌలభ్యం ఉంది. ఒకే యాపిల్ ఐడీతో ఉపయోగిస్తున్న ఐఫోన్, ఐమాక్ లలో ఏదైనా ఒక ఫోన్ లేదా మ్యాక్ లో డిలీట్ చేసిన మెసేజ్ లు మరో ఫోన్ లేదా మ్యాక్ లో చూడొచ్చు. సింక్రనైజేషన్ ప్రక్రియ వల్ల ఇది సాధ్యపడుతుంది.

ఇది తెలియక సదరు భర్త నిశ్చింతగా ఉండగా.. భర్త నిర్వాకాన్ని తన ఫోన్ లో చూసిన భార్య మండిపడింది. విడాకులు కావాలంటూ కోర్టులో దావా వేసి, ఈ మెసేజ్ లను సాక్ష్యంగా అందజేసింది. విడాకులు మంజూరైతే భరణం కింద 5 మిలియన్ డాలర్లు భార్యకు చెల్లించాల్సి వస్తుందని, ఇటు భార్య దూరమై అటు ఆర్థికంగా కూడా నష్టపోయే పరిస్థితి ఎదురైందని భర్త లబోదిబోమన్నాడు. దీనంతటికీ కారణం యాపిల్ కంపెనీయేనని ఆరోపించాడు. ఐమెసేజ్ లు డిలీట్ చేసినపుడు 'యువర్ మెసేజెస్ ఆర్ డిలీటెడ్' అని సందేశం వచ్చిందని, దాంతో తాను భరోసాగా ఉన్నానని చెప్పాడు. అలా కాకుండా 'యువర్ మెసేజెస్ డిలీటెడ్ ఆన్ దిస్ డివైజ్' అనో లేక 'యువర్ మెసేజెస్ డిలీటెడ్ ఆన్ దిస్ డివైజ్ ఓన్లీ' అనో సందేశం కనిపిస్తే పరిస్థితి ఇంతదాకా వచ్చేది కాదన్నారు.

సెక్స్ వర్కర్ తో తన చాటింగ్ విషయాన్ని భార్య మూడ్ బాగున్నపుడు తానే చెప్పేవాడినని అన్నాడు. అయినా సరే తమ మధ్య గొడవ జరిగే అవకాశం ఉందని ఒప్పుకున్నాడు. అయితే, పరిస్థితి విడాకుల దాకా మాత్రం వచ్చేది కాదన్నాడు. తన ద్వారా తెలియాల్సిన విషయం యాపిల్ కంపెనీ నిర్వాకం వల్ల తెలిసేసరికి తన భార్య బాగా హర్టయిందని చెప్పాడు. తనకు జరిగిన నష్టాన్ని పూడ్చాల్సిన బాధ్యత యాపిల్ కంపెనీదేనని స్పష్టం చేశాడు. తనలాంటి పరిస్థితి ఎదుర్కొన్న యాపిల్ వినియోగదారులు కూడా ముందుకు వచ్చి న్యాయపోరాటం చేయాలని పిలుపునిచ్చాడు.

## సచివాలయంలో మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన గుమ్మిడి సంధ్యారాణి

సాలూరు నియోజకవర్గం నుంచి టీడీపీ ఎమ్మెల్యేగా విజయం సాధించిన గుమ్మిడి సంధ్యారాణిని మంత్రి పదవి వరించిన సంగతి తెలిసిందే. ఆమెకు మహిళా, శిశు సంక్షేమం, గిరిజన వ్యవహారాల శాఖలు అప్పగించారు. ఈ నేపథ్యంలో, గుమ్మిడి సంధ్యారాణి నేడు ఏపీ సచివాలయంలోని తన చాంబర్లో మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్ఎంలను నియమిస్తున్నామని తెలిపారు. గిరిజన పాఠశాల్లో డ్రాప్ అవుట్లను నివారిస్తామని చెప్పారు. ఐటీడీఏ, ఐసీడీఎస్ లను ప్రక్షాళన చేస్తున్నామని వివరించారు. అంగన్వాడీల సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామని వెల్లడించారు.

## బార్బడోస్‌లో చొక్కాలు విప్పేసి.. బీచ్ వాలీబాల్ ఆడిన టీమిండియా ప్లేయర్లు..

**జూన్ 20న బార్బడోస్‌లో ఆఫ్ఘనిస్థాన్‌తో తలపడనున్న భారత్**

**ఈ మ్యాచ్ కోసం ఇప్పటికే అక్కడికి చేరుకున్న భారత ప్లేయర్లు**

**సరదాగా బీచ్ వాలీబాల్ ఆడుతూ కనిపించిన వైనం**

**అలా ఆటగాళ్లు సరదాగా బీచ్ వాలీబాల్ ఆడిన వీడియోను 'ఎక్స్' ద్వారా పంచుకున్న బీసీసీఐ**

టీ20 వరల్డ్‌కప్ 2024లో లీగ్ దశ మ్యాచులు ముగిశాయి. దీంతో తదుపరి దశకు చేరిన ఎనిమిది జట్ల విషయంలో క్లారిటీ వచ్చేసింది. ఆ ఎనిమిది జట్లు ఇప్పుడు రెండు గ్రూపులుగా విడిపోయి తమ తదుపరి మ్యాచులను ఆడనున్నాయి. ఈ నెల 19 నుంచి 25వ తేదీ వరకు ఈ సూపర్-8 మ్యాచులు జరగనున్నాయి. ఇక గ్రూప్-1లో భారత్‌తో పాటు ఆస్ట్రేలియా, ఆఫ్ఘనిస్థాన్, బంగ్లాదేశ్ ఉన్నాయి.

దీంతో సూపర్-8లో టీమిండియా మూడు మ్యాచ్‌లు ఆడనుంది. జూన్ 20న బార్బడోస్‌లో తన తొలి మ్యాచ్‌లో ఆఫ్ఘనిస్థాన్‌తో తలపడనుంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే అక్కడికి చేరుకున్న భారత ప్లేయర్లు సరదాగా గడుపుతున్నారు. తాజాగా బీచ్ వాలీబాల్ ఆడుతూ కనిపించారు. విరాట్ కోహ్లీ, హర్దిక్ పాండ్యా, సంజూ శాంసన్, శివం దూబే, యజువేంద్ర చాహల్, అర్ష్‌దీప్ సింగ్, రింకూ సింగ్ తదితర టీమిండియా ఆటగాళ్లు ఇలా సరదాగా బీచ్ వాలీబాల్ ఆడారు.

దీని తాలూకు వీడియోను బీసీసీఐ తన అధికారిక 'ఎక్స్' (ట్విట్టర్) ఖాతాలో పోస్ట్ చేసింది. ఇప్పుడీ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇక ఆఫ్ఘన్‌తో మ్యాచ్ తర్వాత భారత జట్టు వరుసగా జూన్ 22న ఆంటిగ్వాలో బంగ్లాదేశ్‌తో, జూన్ 24న సెయింట్ లూసియాలో ఆస్ట్రేలియా జట్టుతో తలపడనుంది. టీమిండియా మ్యాచులన్నీ భారత కాలమానం ప్రకారం రాత్రి 8 గంటలకు ప్రారంభమవుతాయి.

## రుషికొండ ప్యాలెస్ నుంచి బయటకు రావాల్సిన ఫొటోలు చాలానే ఉన్నాయి: లోకేశ్

**బక్రీద్ సందర్భంగా మంగళగిరిలో ముస్లింలతో కలిసి లోకేశ్ ప్రార్థనలు**

**తాము అధికారంలోకి వచ్చాక కూడా ముగ్గురు టీడీపీ కార్యకర్తలను వైసీపీ నేతలు హతమార్చారని ఆగ్రహం**

**చంద్రబాబు ఆదేశాల వల్లే సంయమనం పాటిస్తున్నామన్న మంత్రి**



రుషికొండ ప్యాలెస్ వ్యవహారంలో బయటకు రావాల్సిన ఫొటోలు చాలానే ఉన్నాయని ఏపీ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. బక్రీద్ సందర్భంగా సోమవారం మంగళగిరి ఈద్గాలో నిర్వహించిన ప్రార్థనల్లో పాల్గొన్న లోకేశ్ ముస్లింలతో కలిసి ప్రార్థనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. రాబోయే వంద రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా గంజాయి విక్రయాలకు చెక్ పెడతామన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ముగ్గురు టీడీపీ కార్యకర్తలను వైసీపీ నేతలు హత్య చేశారని, అయినప్పటికీ శాంతిభద్రతలకు విఘాతం కలిగించవద్దన్న సీఎం ఆదేశాలతో సంయమనం పాటిస్తున్నట్టు చెప్పారు. ప్రజాదర్బార్‌ను అన్ని నియోజకవర్గాల్లోనూ నిర్వహించే అంశాన్ని పరిశీలిస్తున్నట్టు చెప్పారు. కాగా, గత రెండు రోజులుగా లోకేశ్ నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌కు అనూహ్య స్పందన లభిస్తోంది. అందరి సమస్యలను ఓపిగ్గా వింటున్న లోకేశ్.. వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని వారికి భరోసా ఇస్తున్నారు.

## నెల్లూరు-ముంబయి హైవేపై కారును ఢీకొట్టిన పెద్దపులి

**నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలంలో పెద్దపులి సంచారం**

**బద్వేలు నుంచి నెల్లూరుకు వస్తున్న కారు**

**రోడ్డు దాటే ప్రయత్నంలో కారును ఢీకొట్టిన పులి**

**పెద్దపులిని కాస్త దూరం ఈడ్చుకెళ్లిన కారు**

**కాళ్లకు తీవ్ర గాయాలైనప్పటికీ అడవిలోకి పరుగులు తీసిన పులి**



నెల్లూరు జిల్లాలో పెద్దపులి సంచరిస్తుండడం ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. జిల్లాలోని కదిరినాయుడుపల్లె అటవీ ప్రాంతంలో తాజాగా పెద్దపులి దర్శనమిచ్చింది. నెల్లూరు-ముంబయి జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న ఓ కారును పెద్దపులి ఢీకొట్టింది. బద్వేలుకు చెందిన వ్యక్తులు కొందరు కారులో నెల్లూరు వెళుతుండగా ఈ ఘటన జరిగింది. రోడ్డును దాటే క్రమంలో పెద్దపులి అటుగా వస్తున్న కారును ఢీకొట్టింది. కారు... పెద్దపులిని కొంతదూరం వరకు ఈడ్చుకెళ్లినట్టు ప్రత్యక్షసాక్షులు వెల్లడించారు. కాళ్లకు తీవ్ర గాయాలైనప్పటికీ ఆ పులి అడవిలోకి పరుగులు తీసిందని తెలిపారు. పెద్దపులి ఢీకొట్టిన ఘటనలో కారు ముందు భాగం ధ్వంసం కావడం ఆశ్చర్యం కలిగిస్తోంది.

ఈ ఘటన మర్రిపాడు మండలం పరిధిలో జరిగింది. పెద్దపులి సంచరిస్తోందన్న వార్తతో మర్రిపాడు మండల వాసులు హడలిపోతున్నారు. కారులోని ప్రయాణికులైతే వణికిపోయారు. డ్రైవర్ శ్రీనివాసులు బ్రేక్ వేయడంతో పెద్దపులి ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నట్టు తెలుస్తోంది. పెద్దపులి కారును ఢీకొట్టిన ఘటనపై సమాచారం అందుకున్న అటవీశాఖ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. పెద్దపులి కోసం అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేపడతామని వెల్లడించారు.

## ఈ పోలీస్‌కు హ్యాట్సాఫ్ చెప్పాల్సిందే..



ట్రాఫిక్ పోలీసులంటే వాహనాలకు ఫైన్లు వేయడం, సిగ్నల్ దాటితే ఫోటోలు కొట్టడం ఒకటే కాదు. రోడ్లపై వెళ్ళే వాహనదారులకు ఇబ్బందులు లేకుండా ఏపనైనా చేస్తామని నిరూపించారు కేపీహెచ్ బీ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ట్రాఫిక్ కానిస్టేబుల్ స్వామి. వర్షం కారణంగా ఆర్వోబీ ఫ్లైఓవర్ పై నీళ్ల నిలిచి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దింతో అక్కడే డ్యూటి చేస్తున్న కానిస్టేబుల్ స్వామి వెంటనే వరద నీరు వెళ్లేందుకు రూట్ క్లీయర్ చేశాడు. కానిస్టేబుల్ చేసిన పనిని అభినందిస్తూ సోషల్ మీడియాలో వీడియోను పొస్ట్ చేశారు నేటిజన్లు. దింతో ఈ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

## ఆ లింక్ క్లిక్ చేస్తే వాట్సాప్ హ్యాక్

**నిజామాబాద్ జిల్లాలో పది మంది బాధితులు**

**పీఎం కిసాన్ యాప్ లింక్ ను క్లిక్ చేయడంతో హ్యాక్**

**వాట్సాప్ ఓపెన్ కావట్లేదని, ఇతరులకు మెసేజ్ లు పోతున్నాయని ఆవేదన**




వాట్సాప్ లో వచ్చే లింక్ లను తెలిసీతెలియకుండా క్లిక్ చేస్తే ముప్పు తప్పదని సైబర్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. తాజాగా నిజామాబాద్ జిల్లాలో జరిగిన ఉదంతమే దీనికి ఉదాహరణ అని చెబుతున్నారు. జిల్లాలోని సిరికొండ మండలం సోంపెల్లి గ్రామంలో దాదాపు పదిమంది వాట్సాప్ ఖాతాలు హ్యాక్ అయ్యాయని, వారి పేరుతో గుర్తుతెలియని వ్యక్తులు సందేశాలు పంపిస్తున్నారని చెప్పారు. ఇటీవల గ్రామస్థుల వాట్సాప్ గ్రూప్ లోకి పీఎం కిసాన్ యాప్ లింక్ ను కొంతమంది ఫార్వార్డ్ చేశారు. ఈ నెల 18న పీఎం కిసాన్ నిధులు రైతుల ఖాతాల్లో జమచేయనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే తాజా లింక్ వాట్సాప్ గ్రూప్ లలో చక్కర్లు కొడుతోంది. పీఎం కిసాన్ డబ్బులు తమ ఖాతాలో పడతాయనే ఉద్దేశంతో రైతులు ఈ లింక్ ను క్లిక్ చేస్తున్నారు. ఆ తర్వాత కాసేపటికే తమ ఫోన్లలో వాట్సాప్ పనిచేయడంలేదని బాధితులు వాపోతున్నారు. అంతేకాదు.. తమ పేరుతో, తాము పంపినట్లే ఎవరెవరికో సందేశాలు వెళుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సోంపెల్లి గ్రామంలో పదిమంది వాట్సాప్ ఖాతాలు హ్యాకింగ్ కు గురవడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ఈ విషయమై సైబర్ క్రైం డీఎస్పీ హాసీద్ ఉల్లాను మీడియా సంప్రదించగా.. మొబైల్‌లో వచ్చే యాప్‌లపై అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. పీఎం కిసాన్ యాప్ పేరుతో ఏదైనా లింక్ వస్తే ఓపెన్ చేయొద్దని హెచ్చరించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా ఫిర్యాదు చేయాలని చెప్పారు.

## గ్రూప్స్ అభ్యర్థులకు న్యాయం చేయాలి.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ యువతను రెచ్చగొట్టింది: హరీశ్‌రావు

**గ్రూప్స్ పోస్టులు పెంచాలని అడిగితే కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదంటూ ఫైర్**

**గ్రూప్-1, 2 మెయిన్స్ పరీక్షకు 1:100 చొప్పున అనుమతి ఇవ్వాలని అభ్యర్థులు కోరుతున్నారని వ్యాఖ్య**

**గ్రూప్స్ పరీక్షలకు మధ్య వ్యవధి ఉండాలని అభ్యర్థులు కోరుతున్నారన్న హరీశ్‌రావు**



గ్రూప్స్ అభ్యర్థులు వచ్చి పోస్టులు పెంచాలని అడిగితే కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు మండిపడ్డారు. సోమవారం మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ.. గ్రూప్స్ అభ్యర్థులు తాజాగా బీఆర్ఎస్ కార్యాలయానికి వచ్చి ఈ విషయమై తమ వద్ద మొర పెట్టుకున్నారని ఆయన వెల్లడించారు. గ్రూప్-1, 2 మెయిన్స్ పరీక్షకు 1:100 చొప్పున అనుమతి ఇవ్వాలని అభ్యర్థులు కోరుతున్నారని తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు 1:100 ఇవ్వాలని యువతను రెచ్చగొట్టిన కాంగ్రెస్.. ఇప్పుడు ఎందుకు గ్రూప్స్ మెయిన్స్‌కు 1:100 ఇవ్వడం లేదని నిలదీశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు గ్రూప్స్ పోస్టులు పెంచాలని అడిగిన వారు.. ఇప్పుడు ఇదే విషయమై విద్యార్థులు వెళ్లి అడిగితే ఎందుకు స్పందించడం లేదని ఆయన ధ్వజమెత్తారు. ప్రధాన ప్రతిపక్షంగా ప్రభుత్వాన్ని నిలదీయాలంటూ అభ్యర్థులు తమ వద్దకు వచ్చి కోరినట్లు హరీశ్‌రావు వెల్లడించారు. గ్రూప్స్ పరీక్షలకు మధ్య వ్యవధి ఉండాలని అభ్యర్థులు కోరుతున్న విషయాన్ని కూడా ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. జాబ్ క్యాలెండర్ గురించి పత్రికల్లో ప్రకటనలతో ఊదరగొట్టిన కాంగ్రెస్ ఇప్పుడు ఈ విషయంపై ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. అలాగే ఏడాదికి 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని కూడా మాటిచ్చారని గుర్తు చేశారు. ఎన్నికల హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందని హరీశ్‌రావు దుయ్యబట్టారు.

CK NEWS
చంద్ర కాంత్
తెలుగు దినపత్రిక

## రాష్ట్రాన్ని గ్లోబల్ ఎకానమీలో నిలిపిన నిపుణుడు

విశ్వసనీయత, అంకితభావంతో పాటు దార్శనికత కలిగిన నాయకులు ప్రజా జీవన ప్రమాణాలలో పరివర్తన తీసుకురాగలుగుతారు కానీ వర్తమాన భారతవనిలో ఈ తరహా నాయకులు అరుదు. స్థానికాంశాలలో మాత్రమే నిమగ్నమై ఉండే రాష్ట్ర స్థాయి నాయకులే తప్ప దూరదృష్టితో, అంతర్జాతీయ దృక్పథంతో, విదేశాల సౌజన్యంతో తమ రాష్ట్రాల అభివృద్ధి గూర్చి అలోచించేవారు బహు అరుదు. నెహ్రూ హయాం నుండి ఇప్పటి వరకు విదేశాంగ విధానం అనేది పూర్తిగా కేంద్ర అంశం, అందులో రాష్ట్రాల ప్రమేయం ఉండదు. విదేశీ పర్యటనలు, ప్రముఖులతో సమావేశాలు, పెట్టుబడులు వగైరా అన్నీ విదేశాంగ మంత్రిత్వ శాఖే నిర్ణయిస్తుంది. కానీ దీనికి మినహాయింపుగా స్వాతంత్ర్య భారతంలో ప్రప్రథమంగా నారా చంద్రబాబు నాయుడు విదేశీ పర్యటనలతో, ప్రతినిధి బృందాలతో, పెట్టుబడులు తెస్తూ కొత్త ఒరవడిని నెలకొల్పారు. 1990లో శస్త్రచికిత్స కోసం 59 రోజులపాటు అమెరికాకు వెళ్ళిన అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ మర్రి చెన్నారెడ్డి ప్రపంచ బ్యాంకు నుంచి వరదల పునరవాస చర్యల కొరకు రూ.2800కోట్ల రుణాన్ని తీసుకురావడం గురించి, న్యూయార్క్ నుండి ఫాక్స్ ద్వారా జీవోలు జారీ చేయడాన్ని గురించి అప్పట్లో గొప్పగా చెప్పుకున్నారు. ఈ నేపథ్యంలో ఆ తర్వాత, కొన్నాళ్ళకు ముఖ్యమంత్రి అయిన చంద్రబాబు నాయుడు దేశ విదేశాంగ విధాన తీరులో సమూల మార్పును తీసుకోవచ్చారు. అప్పటి వరకు రాష్ట్రాలతో సంబంధం లేకుండా నడిచిన విదేశాంగ విధానంలో రాష్ట్రాలకు కూడా పాత్ర ఉండాలంటూ ముఖ్యమంత్రిగా ఆయన చేసిన వాదనకు జాతి ప్రయోజనాల దృష్ట్యా అందరి నుంచి ఆమోదం లభించింది. ఇప్పుడు 25ఏళ్ళ తర్వాత ఆయన తనయుడు లోకేశ్ కూడా బలమైన రాష్ట్రాలు లేకుండా భారత వికాసం ఎలా అంటూ అడుగుతుండడం ముదావహం. చంద్రబాబు దార్శనికత గూర్చి ఇక్కడ ప్రస్తావించాలి. ఇప్పుడు అమెజాన్, ఫ్లిఫ్‌కార్ట్‌లు నిత్య జీవితంలో ఒక భాగమే, కానీ రెండు దశాబ్దాల క్రితం అనేక వర్ధమాన దేశాలలో సైతం ఈ%-%కామర్స్ గురించి పెద్దగా తెలియని కాలంలో చంద్రబాబు నాయుడు దుబాయిలో ఈ%-%కామర్స్ కేంద్రంగా పురుడుపోసుకుంటున్న ఇంటర్నెట్ సిటీని పర్యటిస్తానని ప్రత్యేకంగా ఆసక్తి చూపారు. అప్పట్లో దీనిపై ఇటు భారతీయ దౌత్యవేత్తలతో పాటు, అప్పటి దుబాయి యువరాజు, ప్రస్తుత రాజు అయిన షేక్ మోహమ్మద్ రాషేద్ అల్ మోఖ్తుం అశ్చర్యపోయారు. భవిష్యత్తు పట్ల ఇంత దార్శనికత కలిగిన ఈ భారతీయ నాయకుడు ఎవరా అని అరబ్బులు ఆసక్తిగా గమనించారు. అప్పటికి ఇంకా బాలుడిగా ఉన్న నారా లోకేశ్‌తో కలిసి ఆయన దుబాయిలోని ఇంటర్నెట్ సిటీని పర్యటించి దాని తీరుతెన్నులను పరిశీలించి సైబరాబాద్‌లోని హైటెక్ టవర్ల నిర్మాణంలో దానికి అనుగుణంగా కొన్ని సూచనలు చేసారు. పెరుగుతున్న ప్రపంచీకరణ నేపథ్యంలో విమానయాన రాకపోకలు లేకుండా అభివృద్ధి సాధ్యం కాదని గ్రహించిన చంద్రబాబు నాయుడు శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి శ్రీకారం చుట్టడమే గాక అందులో విమానాలను నడపడానికి ఎయిర్‌లైన్స్ చుట్టు తిరిగారు. సంప్రదాయకంగా ఇరుదేశాల మధ్య జనవరిలో జరిగే ద్వైపాక్షిక విమానాల రాకపోకల ఒప్పందాలకు భిన్నంగా చంద్రబాబు నాయుడు ఏమిరేట్స్ ఎయిర్‌లైన్స్‌కు హైదరాబాద్‌లో ప్రత్యేక అనుమతి ఇప్పించారు. దాంతో 2001 జూలై 2న ప్రప్రథమ ఏమిరేట్స్ విమానం హైదరాబాద్‌లో దిగింది. అందులో దుబాయి నుంచి వచ్చిన ఏమిరేట్స్ ఎయిర్‌లైన్స్ అత్యున్నత అధికారి ఘయిత్ అల్ ఘయిత్ ఈ విమానం హైదరాబాద్‌కు రావడానికి కేవలం చంద్రబాబు నాయుడు కారణమని ప్రశంసించారు. ఈ విమానం ద్వారా దుబాయి మీదుగా అమెరికా, ఐరోపాలతో సహా ప్రపంచానికి హైదరాబాద్‌కు విమాన సౌకర్యం విరివిగా అందుబాటులో వచ్చింది. ఆ తర్వాత వ్యూహాత్మకంగా హైదరాబాద్‌లో అమెరికన్ సాఫ్ట్‌వేర్ దిగ్గజాలను ఆకర్షించిన చంద్రబాబు నగరంలో అమెరికా కాన్సులేటు నెలకొల్పడానికి నిర్విరామంగా చేసిన ప్రయత్నాలు చూసి సాక్షాత్తూ అమెరికా విదేశాంగ శాఖ సైతం నివ్వెరపోయింది. స్వాతంత్ర భారత చరిత్రలో అమెరికా ప్రప్రథమంగా నెలకొల్పిన కాన్సులేటు ఇదేనని అని చాలమందికి తెలియదు.

దశాబ్దకాలంగా కేవలం ప్రచారానికి మాత్రమే పరిమితమైన విదేశాంగ శాఖలోని 'లుక్ ఈస్ట్' విధానాన్ని చంద్రబాబు తన చేతల ద్వారా దేశానికి చూపించారు. చైనా, సింగపూర్, దక్షిణా కొరియాలతో వ్యూహాత్మక ఆర్థిక ప్రయోజనాలు సాధించారు.

2014లో జపాన్‌లో ఎన్నికలలో నిమగ్నమై ఉన్న ప్రధాని షింజో అబే, విశ్వఖ్యాత ఎలక్ట్రానిక్స్ సంస్థ పానసోనిక్ యాజమాన్యంతో సమావేశమవడానికి సందర్శిస్తానని చంద్రబాబు విజ్ఞప్తి చేయడంతో దౌత్యవేత్తలు ఒకింత అశ్చర్యం వ్యక్తం చేసారు. కానీ అవతలి వైపు నుండి వచ్చిన సానుకూలతతో వారిద్దరితో చంద్రబాబు నాయుడు మాట్లాడిన తీరు జపాన్?లోని భారత రాయబారి దీపా వాధ్వాతో పాటు జపానీ పారిశ్రామికవేత్తలను అబ్బురపర్చింది. మైక్రోసాఫ్ట్ మొదలు కియా మోటర్స్ వరకు అనేక బహుళజాతి బ్రాండ్లను రాష్ట్రానికి తెచ్చిన తీరు దౌత్యవేత్తలకు సైతం మార్గదర్శకంగా నిలించింది. అదే విధంగా, సాధారణంగా రాష్ట్రాల స్థాయి నాయకులను కలవని యూఏఈ అధ్యక్షుడు, ఆబుధాబి రాజు శేఖ్ మోహమ్మద్ బిన్ జాయద్ కూడ 2018లో చంద్రబాబుతో సమావేశమై తాను నవ్యాంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెడుతానని చెప్పినా ఆ తర్వాత ప్రభుత్వ మార్పిడితో అడుగు ముందుకు పడలేదు.

ఆర్థిక ప్రయోజనాలే కాకుండ సగటు ప్రవాసీయుల సమస్యలపై కూడా ఆయన స్పందించారు. గల్ఫ్‌లో మృతదేహాల పెండింగ్ గూర్చి ఈ ప్రతినిధి 1995లో వ్రాసిన ఒక వ్యాసంపై అప్పుడే అధికారం చేపట్టిన చంద్రబాబు నాయుడు స్పందించిన తీరు సౌత్ బ్లాక్‌లో కదలిక తీసుకువచ్చింది. ఈ రకమైన దార్శనికత, అంకితభావం కలిగిన చంద్రబాబు నాయుడి నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ మళ్ళీ అభివృద్ధిబాటపై పయనిస్తుందని ఆశించవచ్చు.

# యుక్తవయసులోనే రక్తపోటు, మధుమేహం సమస్యలు

## అనారోగ్యకర ఆహారం, జీవనశైలి దుష్ఫలితాలు

## కొలన్ లేదా రెక్టమ్ కేన్సర్ ముప్పు



వయసు మీద పడుతుంటే అనారోగ్య సమస్యలు పలకరిస్తుండడం సహజం. కాల క్రమేణా కణాల నష్టం కారణంగా ఇవి తలెత్తుతాయి. అంటే, యుక్త వయసులో ఉన్న వారికి వ్యాధుల ముప్పు ఉండదని కాదు. అనారోగ్యకర జీవనశైలి కారణంగా కొన్ని రకాల వ్యాధులు చుట్టుముట్టే ప్రమాదం యువతీ యువకులకు సైతం ఉంటుంది.

**రక్తపోటు**

రక్తపోటు ఆరోగ్యవంతులైన వారిలో 120/80 ఉండాలి. అయితే, దీనిని మించి అధిక రక్తపోటుకు గురైతే మాత్రం అది గుండె ఆరోగ్యాన్ని, మూత్రపిండాల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. గుండె పోటు లేదా బ్రెయిన్ స్ట్రోక్ రిస్క్ ను ఎదుర్కోవాల్సి వస్తుంది. కుటుంబంలో గుండె జబ్బుల చరిత్ర ఉంటే చిన్న వయసులోనే వారసుల్లో ఇవి కనిపించొచ్చు. ఇటీవలి కాలంలో మనం 40-50 ఏళ్ల మధ్యలో సెలబ్రిటీల మరణాలు చూస్తున్నాం. యువతీ యువకులు డ్యాన్స్ చేస్తూ కుప్పకూలిపోవడం కనిపిస్తోంది. గుండెకు సంబంధించి ఎక్కువ ముప్పు కలిగించే వాటిల్లో అధిక రక్తపోటు ఒకటి. అందుకే కనీసం మూడు లేదా ఐదు నెలలకు ఒకసారి బీపీ చెక్ చేయించుకోవాలి.

**టైప్ 2 మధుమేహం**

టైప్ 2 మధుమేహం రిస్క్ కూడా యువతీ యువకుల్లో పెరుగుతోంది. 14 నుంచి 25 ఏళ్ల వయసులోపు వారిలో ఈ కేసులు 20 శాతం పెరిగినట్టు గణాంకాలు చెబుతున్నాయి. మధుమేహం బారిన పడిన వారు దీన్ని నియంత్రణలో పెట్టుకోకపోతే అది శరీరంలోని కీలక అవయవ వ్యవస్థను దెబ్బతీస్తుంది.

**ఆస్టియో పోరోసిస్**

చిన్న వయసులో ఎముకల సాంద్రత ఎక్కువగా ఉంటుంది. 35 ఏళ్లకు వచ్చిన తర్వాత ఎముకలు ఈ సాంద్రతను క్రమంగా కోల్పోతుంటాయి. ఆస్టియోపోరోసిస్ సమస్య బారిన పడిన వారిలో ఇది మరింత వేగంగా జరుగుతుంది. అంటే ఎముకలను బలహీన పరుస్తుంది. దీంతో ఫ్రాక్చర్ల ముప్పు పెరుగుతుంది. జారి పడిపోయినా, బ్యాలన్స్ తప్పినా ఫ్రాక్చర్ల బారిన పడుతుంటారు. సాధారణంగా 50 ఏళ్ల పైబడిన వారిలో ఈ రిస్క్ ఎక్కువ. కానీ నేటి జీవనశైలితో 30, 40 ఏళ్లల్లోనూ దీని బారిన పడుతున్నారు.

ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటూ, రోజువారీ వ్యాయామం చేస్తూ నిశ్చలమైన జీవనశైలికి దూరంగా ఉండాలి. ఉప్పు, చక్కెర వినియోగాన్ని తగ్గించాలి. పీచు పదార్థాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. మద్యపానం, సిగరెట్లకు స్వస్తి చెప్పాలి. ఏడాదికోసారి అయినా వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా సమస్యల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చు.

**బవెల్ కేన్సర్**

**దీన్నే పేగు కేన్సర్ అని కూడా అంటారు. చిన్న పేగు, పెద్ద పేగు, పురీష నాళం (రెక్టమ్)లో ఎక్కడైనా ఇది రావచ్చు. దీనికి కచ్చితమైన కారణాలను ఇప్పటికీ గుర్తించలేదు. కాకపోతే అతిగా మద్యం సేవించే వారు, ఫైబర్ లేని ఆహారం తీసుకునే వారికి రిస్క్ ఎక్కువని పలు అధ్యయనాల్లో గుర్తించారు. ఎక్కువగా యుక్తవయసులో వారు దీని బారిన పడుతున్నారు. 1950ల్లో పుట్టిన వారితో పోలిస్తే 1990ల్లో పుట్టిన వారికి దీని రిస్క్ రెట్టింపు ఉంటుందట.**



**35 శాతం మందికి బీపీ**

**ఐసీఎంఆర్ నివేదిక వెల్లడి**

**కొంత మెరుగ్గా తెలుగు రాష్ట్రాల పరిస్థితి**

# దేశ జనాభాలో 11 శాతం మందికి మధుమేహం

దేశంలో మధుమేహ బాధితుల సంఖ్య వేగంగా పెరిగిపోతోందని, బీపీ బాధితులు కూడా ఎక్కువేనని ఇండియాస్ మెటబాలిక్ హెల్త్ రిపోర్ట్ (ఐసీఎంఆర్) వెల్లడించింది. జనాభాలో 11 శాతం మందికి మధుమేహం ఉందని పేర్కొంది. మరో 15 శాతం మంది ప్రీడయాబెటిక్ స్టేజిలో ఉన్నారని తెలిపింది. బీపీతో బాధపడుతున్న వారి సంఖ్య తక్కువేం కాదని, మొత్తంగా 35.5 శాతం మంది రక్తపోటు బాధితులేనని వెల్లడించింది. దేశవ్యాప్తంగా నిర్వహించిన అధ్యయనంలో ఈ వివరాలు బయటపడ్డాయని తెలిపింది. ఈ పరిశోధనా పలితాలను లాన్సెట్ జర్నల్ కూడా ప్రచురించింది. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో అసాంక్రమిక వ్యాధుల భారాన్ని అంచనా వేయడానికి ఈ అధ్యయనం చేపట్టినట్లు ఐసీఎంఆర్ శాస్త్రవేత్తలు తెలిపారు. ఇందులో భాగంగా 1,13,043 మంది నుంచి నమూనాలు సేకరించి, విశ్లేషించామని వివరించారు. ఈ నివేదిక ప్రకారం.. మధుమేహం, బీపీ బాధితుల విషయంలో తెలుగు రాష్ట్రాల పరిస్థితి కొంతవరకు మెరుగ్గానే ఉందని చెప్పారు. మధుమేహ బాధితులు ఎక్కువగా గోవా, పుదుచ్చేరి, కేరళ, చండీగఢ్, ఢిల్లీలలో ఉన్నారని, ఈ జాబితాలో తెలంగాణ 17వ స్థానంలో, ఆంధ్రప్రదేశ్ 19వ స్థానంలో నిలిచాయని తెలిపారు. తెలంగాణలో 9.9 శాతం, ఏపీలో 9.5 శాతం మంది మధుమేహంతో బాధపడుతున్నారని చెప్పారు.

# లీల మీద కారం లేదు మమకారం కూడా లేదు..!



:తెలుగు హీరోయిన్ శ్రీ లీలకి అదేంటో అదృష్టం దురదృష్టం రెండు ఒకేసారి వచ్చాయి. పెళ్లిసందడితో ఎంట్రీ ఇచ్చి ధమాకాతో హిట్ కొట్టి వరుసగా ఏడెనిమిది సినిమా ఛాన్స్ లు అందుకున్న లీల టాలీవుడ్ లక్కీ హీరోయిన్ గా క్రేజ్ తెచ్చుకుంది. అయితే అలా సినిమాలు నటిస్తే సరిపోతుందా అవి సక్సెస్ అవ్వాలి కదా. వరుస సినిమాలు ఫ్లాప్ అవుతూ వచ్చి అమ్మడి కెరీర్ గ్రాఫ్ పడిపోయేలా చేశాయి. స్కంద, ఎక్స్ ట్రాడినరీ మ్యాన్, ఆదికేశవ ఇలా వరుస ఫ్లాపులు అమ్మడికి షాక్ ఇచ్చారు. మధ్యలో భగవంత్ కేసరి హిట్ అయినా సరే లాభం లేకుండా పోయింది.
ఇక సంక్రాంతికి వచ్చిన గుంటూరు కారం పర్వాలేదు అనిపించుకున్నా సరే ఆ సినిమా క్రేజ్ ఇమేజ్ అంతా కూడా సూపర్ స్టార్ మహేష్ ఖాతాలో పడింది. గుంటూరు కారంలో రమణ పాత్ర వల్లే సక్సెస్ అందుకుందని అందరికీ తెలిసిందే. సినిమాలో అమ్ము పాత్రలో శ్రీ లీల జస్ట్ ఓకే అనిపించింది. ఇంకా చెప్పాలంటే ఆ సాంగ్స్ లో డ్యాన్స్ చేయడానికి మాత్రమే అన్నట్టు ఉంది.
అందుకే లీల మీద ఏడాది క్రితం వెంట పడ్డ దర్శక నిర్మాతలు ఇప్పుడు ఆమెను లైట్ తీసుకుంటున్నారు.అంతేకాదు రీసెంట్ గా ఒక సినిమా కోసం నిర్మాత ఆమెకు అడ్వాన్స్ గా అమౌంట్ ఇవ్వగా ఇప్పుడూ ఆమెను కాదని వేరే హీరోయిన్ ని తీసుకోవాలని అనుకుంటున్నాడట.
ఇదో రకంగా శ్రీ లీలకు డ్యామేజ్ కలిగించే విషయమే అని చెప్పొచ్చు. రెండు సినిమాలే స్టార్ డం తెచ్చుకుని వరుస సినిమాల ఫ్లాప్ తో అదే స్పీడ్ లో పడిపోయింది అమ్మడు.
అందుకే కెరీర్ విషయంలో కాస్త జాగ్రత్త పడాలని అనుకుంటుంది. శ్రీలీల తీసుకోవాలనుకుంటున్న గ్యాప్ కూడా అందుకోసమే అన్నట్టు తెలుస్తుంది. మరి శ్రీ లీల ఈ టైం లో ఎలాంటి సినిమాలు చేయాలి.. కథల విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే డెసిషన్ ని బట్టే అమ్మడి ఫ్యూచర్ ఆధారపడి ఉంది. శ్రీ లీల తిరిగి ఫాం లోకి రావాలని ఆమె డ్యాన్స్ ని ఇష్టపడే ఫ్యాన్స్ ఆశిస్తున్నారు. ప్రస్తుతం శ్రీ లీల చేతిలో ఉస్తాద్ భగత్ సింగ్ ఒక్కటే ఉంది. ఆ సినిమా ఎప్పుడు వస్తుంది అన్నది చెప్పడం కష్టం.
అయితే ఈలోగా శ్రీ లీల సినిమాలకు కొంత గ్యాప్ ఇచ్చి ఈసారి హిట్ సినిమా కథతో రావాలని అనుకుంటుంది.



ఎల్లి అవ్రామ్ యొక్క మంత్రము గ్దులను చేసే క్లిక్‌లు



అమైరా దస్తూర్ యొక్క అద్భుతమైన అందాల ప్రదర్శన

# పిక్ టాక్ : బుట్టబొమ్మ కూల్ అండ్ స్వీట్



2012 లో తమిళ చిత్రం ముగమూడి తో ఇండస్ట్రీలో అడుగు పెట్టిన ముద్దుగుమ్మ పూజా హెగ్డే. ఈ అమ్మడు తెలుగు లో ఒక లైలా కోసం మరియు ముకుంద సినిమాల్లో నటించింది. ఆ రెండు సినిమాలు కూడా పెద్దగా ఆకట్టుకోక పోవడంతో బాలీవుడ్ కు వెళ్లింది. అక్కడ చేసిన మొహంజదారో సినిమా బాక్సాఫీస్ వద్ద బొక్క బోర్లా పడింది. బాలీవుడ్ నుంచి మళ్లీ టాలీవుడ్ కు 'డీజే' సినిమాతో వచ్చింది. అల్లు అర్జున్, హరీష్ శంకర్ కాంబోలో వచ్చిన ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని సొంతం చేసుకోవడంతో పాటు పూజా హెగ్డే కు మంచి పేరును తెచ్చి పెట్టింది. దాంతో టాలీవుడ్ లో వరుసగా స్టార్ హీరోల సినిమాల్లో నటించే అవకాశాన్ని దక్కించుకుంది.
హీరోయిన్ గా పూజా హెగ్డే టాలీవుడ్ లోని దాదాపు అందరు స్టార్ హీరోలకు జోడీగా నటించింది. ఈ మధ్య కాలంలో ఈ అమ్మడికి కాస్త అవకాశాలు తగ్గాయి. బాలీవుడ్ తో పాటు కోలీవుడ్ లో కూడా ఈ అమ్మడు ప్రయత్నాలు చేస్తుంది కానీ ఆశించిన స్థాయిలో ఆఫర్లు రావడం లేదు.
అయితే సోషల్ మీడియాలో మాత్రం ఈ బుట్టబొమ్మ అందాల ఆరబోత ఫోటోలు షేర్ చేయడం తగ్గడం లేదు. ఈ మధ్య కాలంలో వరుసగా అందాల షో ఫోటోలు షేర్ చేయడం ద్వారా మళ్లీ టాలీవుడ్ లో బిజీ అవుతుందా అనే చర్చ కూడా జరుగుతుంది.
%ూశ్రీంశీ =ఝు౦% - వయసు 48.. మనసు 18 .. ఎవరీ నటి?
ఆకట్టుకునే అందంతో పాటు మంచి ఫిజిక్ ఈ బుట్టబొమ్మ సొంతం. అందుకే ఫోటోలకు మంచి స్పందన వస్తుంది. సోషల్ మీడియాలో పూజా హెగ్డే ఏ ఫోటో షేర్ చేసినా కూడా వెంటనే లక్షల్లో లైక్స్ మరియు షేర్స్ రావడం మనం చూస్తూనే ఉంటాం.దహీరోయిన్ గా ఇంత తక్కువ సమయంలోనే ఈ అమ్మడు కనుమరుగు అవ్వడం దారుణమైన విషయం అంటూ అభిమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా షేర్ చేసిన ఈ ఫోటోలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. సింపుల్ అండ్ స్వీట్ లుక్ లో క్లీ వేజ్ షో చేస్తూ పూజా హెగ్డే అందాల షో కి అంతా ఫిదా అవుతున్నారు.